## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

నాటికాలమందు మేటిగా జనులంత
ఎడ్లబండిలోన వేడుకగను
దవ్వునెంతనైన దడయక పయనంబు
చేసినారు వారు చింతలేక

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644


# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 8 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 11-05-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00



# తెలంగాణలోనూ పాగా వేస్తాం

దేశంలో అన్ని రాష్ట్రాలు మాకు సమానమే

బెంగాల్ ఉత్సాహం కొనసాగిస్తాం

- కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ అవినీతి రాజ్యమేనని విసుర్లు
- తెలంగాణలో కూడా అబ్ కీ బార్ బీజేపీ సర్కార్ నేడు వినిపిస్తోంది
- నేటి తరాలు సైతం బీజేపీ సర్కారు పాలన కావాలని కోరుకుంటున్నాయి
- బీజేపీ భారీ బహిరంగ సభ వేదికపై నుంచి ప్రధాని మోడీ ప్రకటన

**హైదరాబాద్ మే 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హైదరాబాద్ నగరంలోని ప్రసిద్ధ పరేడ్ గ్రౌండ్స్ మరోసారి రాజకీయ చైతన్యానికి వేదికగా మారింది. వేలాది మంది ప్రజల సమక్షంలో జరిగిన భారీ బహిరంగ సభలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొని దేశ అభివృద్ధి, తెలంగాణ పురోగతి, యువత భవిష్యత్తు, సంక్షేమ పథకాలు వంటి పలు అంశాలపై విస్తృతంగా ప్రసంగించారు. తొలిసారిగా పశ్చిమ బెంగాల్ లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని, బెంగాల్ లో ఎలాంటి ఉత్సాహాన్ని చూశామో, తెలంగాణలో కూడా అదే ఉత్సాహం కనిపిస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఆదివారం తెలంగాణ పర్యటనకు వచ్చిన

-మిగతా 2 లో







# విజయ్.. అనే నేను

ముఖ్యమంత్రిగా జోసెఫ్ విజయ్ ప్రమాణ స్వీకారం

- ఉప్పొంగిపోయిన తల్లిదండ్రులు
- కార్యక్రమానికి హాజరైన రాహుల్ గాంధీ
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన త్రిష
- అభిమానులు, కార్యకర్తలతో కిటకిటలాడిన నెహ్రూ స్టేడియం
- ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్ రాజేంద్ర అర్లేకర్

తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది. తమిళ వెట్రి కజగం (టీవీకే) అధినేత జోసెఫ్ విజయ్ ఆదివారం ఉదయం 10 గంటలకు తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం వేదికగా నిలిచింది. విజయ్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా, 2013లో అప్పటి ప్రభుత్వం సినీ వేడుకల్లో దళపతి విజయ్‌ని చివరి వరుసలో కూర్చోబెట్టగా.. నేడు అదే స్టేడియంలో తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణం చేయడాన్ని అభిమానులు గుర్తు చేసుకుంటున్నారు. కార్యక్రమానికి విజయ్ తల్లిదండ్రులు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సహా పలువురు హాజరయ్యారు. టీవీకే కార్యకర్తలు, విజయ్ అభిమానులు పెద్ద ఎత్తున రావడంతో నెహ్రూ ఇండోర్ స్టేడియంలో పండుగ వాతావరణం కనిపించింది. సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకార వేడుకలో నటి త్రిష ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అంతకుముందు శనివారం సాయంత్రం విజయ్ తన మిత్రపక్షాల మద్దతు లేఖలతో గవర్నర్ రాజేంద్ర అర్లేకర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 164 ప్రకారం విజయ్‌ను ముఖ్యమంత్రిగా నియమిస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. మే 13లోగా అసెంబ్లీలో తన బలాన్ని నిరూపించుకోవాలని గవర్నర్ ఆయనకు సూచించారు.
- చెన్నై,

2 లో





## పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడి..

- 15 మంది పోలీసులు మృతి..
- ముగ్గురికి గాయాలు

2 లో



## పవన్ కల్యాణ్ నివాసానికి ప్రధాని మోడీ

- ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్‌ను పరామర్శించిన ప్రధాని
- పవన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మోడీ
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష.. కృతజ్ఞతలు తెలిపిన పవన్

**అమరావతి: మే 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరామర్శించారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న ప్రధాని, ఆదివారం జూబ్లీహిల్స్‌లోని పవన్ కల్యాణ్ నివాసానికి ప్రత్యేకంగా వెళ్లారు. ఇటీవల సైనస్ సమస్య కారణంగా పవన్ శస్త్రచికిత్స చేయించుకుని, ప్రస్తుతం ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్‌ను కలుసుకున్న ప్రధాని మోడీ, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని, తిరిగి ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టాలని ఆకాంక్షించారు.

-మిగతా 2 లో

## తలసేమియాపై చైతన్యమే ఆయుధం

- ముందస్తు పరీక్షలతోనే భావితరాలకు రక్షణ
- ఆరోగ్యమైన సమాజ నిర్మాణానికి అందరూ కలిసిరావాలి: నారా భువనేశ్వరి




**హైదరాబాద్, మే 10(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
"తలసేమియా అనేది భయపడాల్సిన అంటువ్యాధి కాదు.. కానీ నిర్లక్ష్యం చేస్తే చిన్నారుల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేసే వంశపారంపర్య రక్త రుగ్మత. అందుకే ప్రతి కుటుంబంలో అవగాహన పెరగాలి.. ముందస్తు పరీక్షలు తప్పనిసరి కావాలి" అని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు.ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 3కే, 5కే, 10కే "తలసేమియా రన్" కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. సమాజంలో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

-మిగతా 2 లో

## టీఎంసీలో అసమ్మతి మమత, అభిషేక్ బెనర్జీలపై తిరుగుబాటు

2 లో





## ఈ ఏడాది యథావిధిగా ఇంటర్ అడ్మిషన్లు

- పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్ విలీనంపై సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి
- భాగస్వాములతో విస్తృత సంప్రదింపులు, శాసనసభలో చర్చ తర్వాతే నిర్ణయం
- మెజారిటీ రాష్ట్రాలు 11, 12 తరగతుల విధానం అమలు

**హైదరాబాద్ మే 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఈ ఏడాది యథావిధిగా ఇంటర్మీడియట్ ప్రవేశాలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రవేశాలకు సమయం తక్కువగా ఉండడం, ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియకు పలు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండడంతో విద్యార్థుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా వెంటనే ప్రవేశాల ప్రక్రియను చేపట్టాలని సీఎం సూచించారు. ఇంటర్మీడియట్ ను రద్దు చేసి సీబీఎస్ఈలో మాదిరి 11, 12 తరగతులు నిర్వహించాలని.. ఫలితంగా డ్రాపౌట్స్ సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది.

-మిగతా 2 లో



## తక్షణమే రాష్ట్ర హోదా ఇవ్వాలి

- కేంద్రం అలసత్వంతో అత్యంత అధ్వాన్నంగా ప్రభుత్వ రూపం
- పీటీఐతో జమ్ముకాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్**
జమ్మూ కాశ్మీర్‌లోని ప్రస్తుత పరిపాలనా వ్యవస్థ అత్యంత అధ్వానమైన ప్రభుత్వ రూపం"గా ఉందని, పూర్తి రాష్ట్ర హోదా దిశగా తక్షణమే మారాలని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఆయన పీటీఐతో మాట్లాడుతూ జమ్మూ, శ్రీనగర్‌ల మధ్య రాజకీయంగా చీలిక తీసుకురావడానికి కొన్ని స్వార్థపర శక్తులు ప్రయత్నిస్తున్నాయని, అవి ఇప్పటికే విఫలమయ్యాయని, భవిష్యత్తులోనూ విఫలమవుతాయని చెప్పారు. ఈ రెండు ప్రాంతాల మధ్య ఉన్న భావోద్వేగ అంతరాన్ని తగ్గించేందుకు గతంలో 'దర్బార్ మూవ్'గా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రాజధానిని మార్చే సాంప్రదాయ పద్ధతిని పునరుద్ధరించడం ఒక కీలకమైన వారధి అని ఆయన చెప్పారు. 90 మంది ఎన్నికైన శాసనసభ్యులు ఉన్న ఒక ప్రాంతాన్ని, కేవలం 30 మంది మాత్రమే ఉన్న పుదుచ్చేరి వంటి చిన్న ప్రాంతాలతో సమానంగా చూడటం సరికాదని అన్నారు. రెండు రకాల అధికార నిర్మాణాలు ఉండే ద్వంద్వ అధికార వ్యవస్థ "విపత్తుకు దారితీస్తుందని" తాను గతంలో చెప్పానని గుర్తు చేశారు. "కేంద్ర సేవలు, శాంతిభద్రతలు, పోలీసుల విషయాలపై నేను వాదించడం లేదు. కేంద్ర పాలిత ప్రాంతంగా, ఆ అంశాలు స్వయంచాలకంగా ఎన్నిక కాని ప్రభుత్వ (కేంద్రం) పరిధిలోనే ఉంటాయి. కానీ ఈ సంస్థలు గతంలో ఎన్నికైన ప్రభుత్వ బాధ్యతగా ఉండేవి. అవి అలాగే ఉండాలి," అని అన్నారు. పహల్గామ్

-మిగతా 2 లో

# తెలంగాణపై పెద్ద మనసు చూపండి

- ప్రధాని మోడీకి సీఎం రేవంత్ విజ్ఞప్తి
- దేశాభివృద్ధిలో తెలంగాణ భాగస్వామ్యంపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు
- పీఎంతో కలిసి ఒకే వేదికగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం
- వికసిత్ భారత్‌తో కలిసి నడుస్తామని భరోసా

**రాష్ట్ర అభివృద్ధిలో మోడీ సహకరించాలి**

**హైదరాబాద్ మే 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణను నంబర్ వన్ చేయడమే మా లక్ష్యం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని, దీనిలో తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల వాటా ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకుందని చెప్పారు. వీటిని సాధించేందుకు, తెలంగాణ అభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సహకారం కావాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ పరిసరాల్లో జరిగిన పలు అభివృద్ధి ప్రారంభోత్సవాల కార్యక్రమంలో మాట్లాడిన రేవంత్ రెడ్డి ఇది

-మిగతా 2 లో



# విజయ్.. అనే నేను



– చెన్నై,
టీవీకే చీఫ్ విజయ్ ప్రమాణస్వీకార కార్యక్రమం అశేష జనసందోహం నడుమ జరిగింది. 'విజయ్ అనే నేను..' అంటూ ఆయన తమిళనాడు ముఖ్యమంత్రి గా ప్రమాణస్వీకారం చేశారు. ఆ రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ .. విజయ్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం లో జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ తదితరులు హాజరయ్యారు. సరిగ్గా ఉదయం 10.30 గంటలకు విజయం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి విజయ్ అభిమానులు, టీవీకే కార్యకర్తలు కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దాంతో స్టేడియం అంతా సందడి నెలకొన్నది. ఈ కార్యక్రమంలో సినీనటి త్రిష కూడా మెరిశారు. ఆమె ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇక విజయ్‌తోపాటు మరో తొమ్మిది మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వారిలో ఏడుగురు టీవీకే ఎమ్మెల్యేలు, ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో ఒక మహిళ కూడా ఉన్నారు. వామపక్షాలు క్యాబినెటల్‌లో చేరేందుకు నిరాకరించడంతో వారి మంత్రివర్గంలో చోటుకల్పించలేదు. మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఎన్ ఆనంద్, ఆదవ అర్జున, కేఏ సెంగోటియన్, ఎస్ కీర్తన, కేజీ అరుణ్ రాజ్, పీ వెంకటరమణన్, సీఆర్ నిర్మల్ కుమార్ ఉన్నారు. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకుగానూ విజయ్ పార్టీ 108 స్థానాల్లో గెలుపుతో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచింది. కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు కూడగట్టి.. విజయ్ ఇవాళ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు స్టేడియానికి చేరుకున్న గవర్నర్ అర్లేకర్‌కు విజయ్ శాలువా కప్పి స్వాగతం పలికారు.

## పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడి..

**-15 మంది పోలీసులు మృతి..**
**- ముగ్గురికి గాయాలు**



**న్యూఢిల్లీ**
పాకిస్తాన్‌లో భారీ ఆత్మాహుతి దాడి జరిగింది. బన్ను ప్రాంతంలోని ఒక పోలీస్ చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి జరిగిన ఆత్మాహుతి దాడిలో 15 మంది పోలీసులకు మరణించారు. మరో ముగ్గురికిపైగా గాయపడ్డారు. అంతర్జాతీయ మీడియా కథనం ప్రకారం.. బన్ను ప్రాంతంలోని ఫతే ఖేల్ పోలీస్ చెక్‌పోస్టు వద్దకు పేలుడు పదార్థాలతో కూడిన ఒక వాహనం శనివారం రాత్రి దూసుకొచ్చింది. ఆ వెంటనే పేలుడు జరిగింది. ఈ ఘటనలో అక్కడ విధులు నిర్వహిస్తున్న 15 మంది పోలీసులు మరణించారు. వాహనంలో పేలుడు పదార్థాలు భారీగా ఉండటంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంది. చాలా మంది పోలీసులు చాలా దూరం ఎగిరిపడ్డారు. కొందరు పోలీసులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారి మృతదేహాల్ని బయటకు తీశారు. ఈ ఘటనతో అక్కడి నిర్మానం పూర్తిగా కూలిపోయింది. గాయపడ్డవారిని స్థానిక ఆస్పత్రులకు తరలించారు. రాత్రంతా సహాయక చర్యలు చేపట్టినట్లు స్థానిక డీఐజీ సజ్జాద్ ఖాన్ తెలిపారు. బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఆత్మాహుతి దాడిలో పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో చుట్టుపక్కల చాలా దూరం వరకు నివాసాలు, ఇతర బిల్డింగులు కూడా ధ్వంసమైనట్లు పోలీసులు తెలిపారు. కొన్ని చోట్ల పేలుడు తీవ్రతకు ఇంటి పైకప్పులు కూడా కూలిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సహాయక చర్యలు చేపడుతుండగా, ఉగ్రవాదులు మళ్లీ దాడి చేసే అవకాశం ఉందన్న భయంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో భారీ స్థాయిలో పోలీసుల్ని మోహరించినట్లు చెప్పారు. ఈ ఘటనను స్థానిక నేతలు ఖండించారు. మరోవైపు తాము పది చోట్ల దాడులకు పాల్పడినట్లు బలూచిస్తాన్ లిబరేషన్ ఫ్రంట్ సంస్థ ప్రకటించుకుంది.

## పవన్ కల్యాణ్ నివాసానికి ప్రధాని మోడీ

మొదటి తరువాయి

తన కోసం స్వయంగా ఇంటికి వచ్చి పరామర్శించడం పట్ల పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీకి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పవన్‌ను పరామర్శించిన అనంతరం, ప్రధాని మోడీ జూబ్లీహిల్స్‌లోనే ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి వెళ్లారు.

## తలసేమియాపై చైతన్యమే ఆయుధం


మొదటి తరువాయి

తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే జన్యుపరమైన రక్తహీనత వ్యాధే తలసేమియా అని ఆమె వివరించారు. ఈ వ్యాధి కారణంగా శరీరంలో హీమోగ్లోబిన్ సరైన స్థాయిలో తయారుకాకపోవడంతో రక్తంలో ఆక్సిజన్ సరఫరా తగ్గిపోతుందని, ఫలితంగా చిన్నారులు తీవ్ర రక్తహీనతతో బాధపడాల్సి వస్తుందని చెప్పారు. తల్లిదండ్రులిద్దరూ జన్యువాహకులు (క్యారియర్లు) అయితే పుట్టబోయే బిడ్డకు తలసేమియా వచ్చే ప్రమాదం అధికంగా ఉంటుందని ఆమె హెచ్చరించారు. వివాహానికి ముందు రక్తపరీక్షలు చేయించుకోవడం, గర్భధారణ సమయంలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం, కుటుంబాల్లో అవగాహన పెంపొందించడం ద్వారా ఈ వ్యాధిని చాలా వరకు నియంత్రించవచ్చని సూచించారు. తలసేమియాకు పూర్తిస్థాయి సులభమైన చికిత్స అందుబాటులో లేకపోయినా, రెగ్యులర్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్, ఐరన్ నియంత్రణ మందులు, వైద్యుల పర్యవేక్షణ, అవసరమైతే బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ ద్వారా బాధితులకు ఉపశమనం కల్పించవచ్చని తెలిపారు. అయితే ఈ చికిత్సలు ఖరీదైనవిగా ఉండటంతో "నివారణే ఉత్తమ మార్గం" అని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని, తలసేమియా బాధిత చిన్నారులకు మానసికంగా అండగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రభుత్వం మాత్రమే కాకుండా సమాజంలోని ప్రతి వర్గం కలిసి పనిచేస్తేనే తలసేమియా రహిత సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. "ముందస్తు పరీక్షలు.. సరైన అవగాహన.. సామాజిక బాధ్యత --- ఈ మూడు ఉంటే తలసేమియాను అరికట్టడం సాధ్యమే. ఆరోగ్యమైన భావితరాల కోసం అందరం కలిసి కృషి చేద్దాం" అని నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు.

# తెలంగాణలోనూ పాగా వేస్తాం

మొదటి తరువాయి

ప్రధాని మోడీ పరేడ్ గ్రౌండ్స్ లో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. 'నా ప్రియమైన తెలంగాణ ప్రజలారా' అంటూ తెలుగులో ప్రధాని తన ప్రసంగాన్ని ప్రారంభించారు. బెంగాల్ ప్రజలు మమతా బెనర్జీ, లెఫ్ట్ పార్టీలను తిరస్కరించారని ఆయన అన్నారు. మమత నియంతృత్వం నుంచి బెంగాల్ విముక్తమైందని అన్నారు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ అవినీతి రాజ్యమేలుతుందని ప్రధాని మోడీ విమర్శలు చేశారు. అబ్ కీ బార్ బీజేపీ సర్కార్ తెలంగాణలో కూడా వినిపిస్తోందని చెప్పారు. తెలంగాణ యువత ప్రేమను నా కళ్లతో చూస్తున్నాని అన్నారు. ప్రధాని మోడీ ప్రసంగం ద్వారా అభివృద్ధి, సంక్షేమం, జాతీయత అనే అంశాలను ప్రజల ముందుకు తీసుకురావడానికి ప్రయత్నించారు. తెలంగాణలో బీజేపీ సర్కార్ వస్తుంది! రాజకీయాల్లో గెలుపోటములు సహజమని ప్రధాని మోడీ, పశ్చిమ బెంగాల్ లో ఓడిపోయింది రాజకీయ పార్టీ కాదని, రాజ్యాంగ వ్యతిరేక శక్తులని అన్నారు. పశ్చిమబెంగాల్ లో అవినీతి, కుటుంబ పార్టీలను ప్రజలు ఓడించారని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఇంత ప్రేమ చూపించడం తన అదృష్టమన్నారు. దేశం మొత్తం మార్పును కోరుకుంటోందని ప్రధాని, ఏ రాష్ట్రంలోనైనా కుటుంబ పాలనను ప్రజలు కోరుకోవట్లేదని పేర్కొన్నారు. ఈసారి తెలంగాణలోనూ బీజేపీ సర్కార్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు కూడా కుటుంబ పార్టీలేనని తెలంగాణ అభివృద్ధికి ఎన్డీయే సర్కార్ కట్టుబడి ఉందన్నారు. కర్ణాటకలో బాధపడుతున్నారు. తెలంగాణలో జహీరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్ మంజూరు చేసినట్లు మోడీ ప్రకటించారు. దేశం మొత్తానికి 7 పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్కులు ఇస్తే, అందులో ఒకటి తెలంగాణకు ఇచ్చినట్లు గుర్తు చేశారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్ తో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, బీజేపీ దృష్టి ఎప్పుడూ అభివృద్ధి, ఉపాధి మీద మాత్రమే ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్‌ను గెలిపించినందుకు కర్ణాటక ప్రజలు బాధపడుతున్నారని, తెలంగాణలోనూ అలానే ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ విధానం మొదట ఓట్లు దండుకో, తర్వాత మర్చిపో అన్నట్లుగా ఉందన్నారు. కాంగ్రెస్ పొత్తులు ఎప్పుడూ అభివృద్ధి నిరోధకాలనే ఉంటాయని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో బీజేపీ విస్తరిస్తోందని అన్నారు. పదేళ్ల క్రితం బెంగాల్ లో ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేలు ఉండేవారని, ఇప్పుడు 200కు పైగా ఎమ్మెల్యేలు ఉన్నారని అన్నారు. ఒక్కప్పుడు బీజేపీ కార్యకర్తలు కూడా లేని బెంగాల్ లో ఇప్పుడు



బీజేపీ ప్రభుత్వం వచ్చిందని అన్నారు. ఒకప్పుడు బీజేపీకి ఇద్దరు ఎంపీలు ఉండేవారని, ఒకరు తెలంగాణ వారే అని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ పాలనతో తెలంగాణ ప్రజలు విసిగిపోయారని ఆయన అన్నారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ నమ్ముతుందని, దేశ అభివృద్ధిలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. తెలంగాణకు వేల కోట్ల నిధులు ఇస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌కు అన్ని రకాలుగా కేంద్రం అభివృద్ధి చేస్తుందని వివరించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో భారీ మెజారిటీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ దేశంలోని ప్రధాన ఐటీ, స్టార్టప్ కేంద్రంగా అభివృద్ధి చేయడంలో కేంద్రం సహకారం ఉందో అని పేర్కొన్నారు. మెట్రో విస్తరణ, రహదారుల అభివృద్ధి, రైల్వే ప్రాజెక్టులు, డిజిటల్ మౌలిక వసతులపై కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందని చెప్పారు. తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు కేంద్రం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆయన తెలిపారు. "యువత శక్తి భారత భవిష్యత్తు" అని పేర్కొంటూ స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి పథకాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయని వివరించారు.

**పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**
ప్రధాని మోడీ తన ప్రసంగంలో పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఉచిత గ్యాస్ కనెక్షన్లు, పక్కా ఇళ్లు, ఉచిత ధాన్యం పంపిణీ, ఆరోగ్య బీమా వంటి పథకాల ద్వారా కోట్లాది మంది ప్రజలకు లాభం చేకూరిందని చెప్పారు. "సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్" అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, రైతుల సంక్షేమం కూడా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందించే పథకాలు దేశవ్యాప్తంగా అమలు అవుతున్నాయని, వ్యవసాయ రంగంలో సాంకేతికతను ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు.

**అవినీతి, కుటుంబ రాజకీయాలపై విమర్శలు**
ప్రధాని తన ప్రసంగంలో ప్రత్యర్థి పార్టీలపై కూడా విమర్శలు గుప్పించారు. అవినీతి, కుటుంబ పాలన దేశ అభివృద్ధికి అడ్డంకిగా మారాయని పేర్కొన్నారు. ప్రజల డబ్బును దోచుకునే రాజకీయాలకు ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. పారదర్శక పాలన ద్వారానే ప్రజల విశ్వాసం సంపాదించగలమని అన్నారు. దేశ ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయాలను ప్రజలు అర్థం చేసుకుంటున్నారని, అందుకే దేశవ్యాప్తంగా ప్రజల మద్దతు పెరుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణలో కూడా అభివృద్ధి రాజకీయాలు రావాల్సిన అవసరం ఉందని అన్నారు.

**యువత, మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యం**
ప్రసంగంలో యువత, మహిళా సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. మహిళల భద్రత, విద్య, ఆర్థిక స్వావలంబన కోసం కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందని చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహాయం పెంచుతున్నామని తెలిపారు. యువతను ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా ఉద్యోగాలు కల్పించే స్థాయికి తీసుకువెళ్లాలని ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కొత్త పరిశ్రమలు, స్టార్టప్‌లు, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో భారత్ ప్రపంచంలో ముందంజలో ఉందని పేర్కొన్నారు.

**జాతీయత, ఐక్యతపై సందేశం**
దేశ భద్రత, జాతీయతపై కూడా ప్రధాని భావోద్వేగంగా మాట్లాడారు. "దేశం ముందుగా, పార్టీ తర్వాత" అనే భావనతో ప్రతి పౌరుడు పనిచేయాలని పిలుపునిచ్చారు. భారతదేశం ప్రపంచంలో శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందని, ఇందులో ప్రతి భారతీయుడి పాత్ర ముఖ్యమని అన్నారు. సరిహద్దుల్లో సైన్యం దేశ రక్షణ కోసం అప్రమత్తంగా పనిచేస్తోందని, దేశ భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడదని స్పష్టం చేశారు. "వికసిత్ భారత్" నిర్మాణంలో తెలంగాణ ప్రజలు కీలక భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

**సభ విజయవంతం**
సభా ప్రాంగణం మొత్తం జాతీయ జెండాలు, పార్టీ జెండాలు, నినాదాలతో మారుమోగిపోయింది. ప్రజల ఉత్సాహం సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రధాని ప్రసంగం మొత్తం ప్రజలు ఆసక్తిగా విన్నారు. పలుమార్లు నినాదాలతో సభా ప్రాంగణం మారుమోగింది. యువత, మహిళలు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా నిర్వహించబడ్డాయి. ఈ సభ తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసేలా కనిపిస్తోంది.

# తెలంగాణపై పెద్ద మనసు చూపండి

మొదటి తరువాయి

కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం కాదని ఇది వికాస్ ఉత్సవం అన్నారు. ప్రధాని ప్రణాళిక అయిన వికసిత్ భారత్‌తో కలిసి నడుస్తామని, ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయిపోయాయని ఇప్పుడు రాజకీయాలు మాట్లాడాల్సిన పని లేదు అభివృద్ధి గురించే మాట్లాడదామన్నారు. దేశ జనాభాలో తెలంగాణ 3 శాతం వాటా కలిగి ఉందని దేశ జీడీపీకి తెలంగాణ 5 శాతం వాటా ఇస్తోందన్నారు. ప్రధానిది పెద్ద మనసు అని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ అంటుంటారు. తెలంగాణపై కూడా పెద్ద మనసు చూపించాలని విజ్ఞప్తి చేశారు. మోడీపై తెలంగాణ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని దేశాన్ని మోడీ అభివృద్ధి చేస్తున్నారని కానీ తెలంగాణకు తగిన ప్రాధాన్యత లభించడం లేదన్నారు.

**పీఎంఓలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ పెట్టండి:**
దేశాభివృద్ధిలో ఆరు మహానగరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, దేశానికి సింహభాగం ఆదాయం ఇస్తున్న ఆరు నగరాలను కేంద్రం ప్రోత్సహించాలని సీఎం



రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ఆరు నగరాల అభివృద్ధి, అనుమతుల కోసం పీఎంఓలో స్పెషల్ టాస్క్ ఫోర్స్, సింగిల్ విండో విధానం కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలన్నారు. తాను ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులతో అనేక సార్లు కలిశానని తాను కలిసి పనుల్లో కొన్ని పనులు అయ్యాయని, మరి కొన్ని పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. వికసిత్ భారత్ కోసం మీరు ఎంత వేగంగా పని చేస్తున్నారో తెలంగాణలో అంత వేగంగా పనులు జరగడం లేదని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైల్, మూసీ, ఫ్యూచర్ సిటీ, రేడియల్ రోడ్లు, హైదరాబాద్ - మచిలీపట్నం పోర్టు కోసం హైవే, రైల్వే లైన్ అంశాలపై కేవలం ప్రధాని మోడీ కేవలం 2 గంటల సమయం ఇవ్వాలన్నారు. మా ప్రతిపాదనలన్నీ మీ ముందు ఉంచుతామని సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు.

**ఒకే వేదికపై ప్రధానితో కలిసి పాల్గొన్న సీఎం:** ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటన ఆదివారం ఉత్సాహంగా జరిగింది. బెంగళూరు నుంచి బేగంపేట విమానాశ్రయంలో ల్యాండ్ అయిన మోడీ అక్కడి నుంచి నేరుగా మాదాపూర్‌లోని హెచ్ఐసీసీ ప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడ నిర్వహించిన అధికారిక కార్యక్రమానికి ప్రధానితో పాటు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఐసీసీలో ప్రధాని మోడీని సీఎం రేవంత్ రెడ్డి సత్కరించారు. ప్రధానికి రేవంత్ రెడ్డి వెండి నంది విగ్రహాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రూ. 9,377 కోట్ల విలువైన అభివృద్ధి పనులను మోడీ వర్చువల్ గా ప్రారంభించారు.

## టీఎంసీలో అసమ్మతి మమత, అభిషేక్ బెనర్జీలపై తిరుగుబాటు



కోల్‌కతా
పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పరాజయం పాలైన తరువాత ఆ పార్టీలో మునుపెన్నడూ లేని స్థాయిలో అసమ్మతి వ్యక్తం అవుతున్నది. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ సహా పార్టీ అగ్రనాయకత్వపై సొంత పార్టీ నేతలే తిరుగుబాటుకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్నారన్న కారణంతో శనివారం ముగ్గురు అధికార ప్రతినిధులను ఆరేండ్లపాటు పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. అయినప్పటికీ వారిలోని తిరుగుబాటు ధోరణి తగ్గడం లేదని తెలుస్తున్నది. టీవీ డిబేట్లలో పార్టీ వాణిని బలంగా వినిపించే అధికార ప్రతినిధి రిజు దత్తా 'ఎక్స్' వేదికగా ఓ వీడియో విడుదల చేశారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు సువేందుపై తాను చేసిన అసభ్యకర వ్యాఖ్యలు టీఎంసీ నాయకత్వం ఒత్తిడి, బెదిరింపుల మేరకే చేశానని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు క్రమశిక్షణ సంఘం ముందు హాజరు కావాలని టీఎంసీ ఆదేశించినా ఆయన వెళ్లలేదు. మాజీ క్రికెటర్, మమత క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేసిన మనోజ్ తివారీ సైతం పార్టీ నాయకత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టికెట్ కోసం ఒక్కో అభ్యర్థి నుంచి రూ.5 కోట్లు డిమాండ్ చేశారని, తాను అంత డబ్బు ఇచ్చేందుకు నిరాకరించానని తెలిపారు.

## ఈ ఏడాది యథావిధిగా ఇంటర్ అడ్మిషన్లు

మొదటి తరువాయి

సీబీఎస్ఈతో పాటు మెజారిటీ రాష్ట్రాలు 11, 12 తరగతుల విధానాన్ని అనుసరిస్తున్నాయి. మన రాష్ట్రంలో మాత్రం ఇంటర్మీడియట్ విద్య వేరుగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదివిన విద్యార్థుల్లో అత్యధికులు ఆ తర్వాత ఇంటర్మీడియట్‌కు వేరుగా ఉన్న కళాశాలల్లో చేరడం లేదు. అప్పటితో విద్యను నిలిపివేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్‌ను వేరుగా కాకుండా 11, 12 తరగతులుగా కొనసాగించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గతంలో అధికారులకు సూచించారు. ఇదే అంశాన్ని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సైతం తన నివేదికలో పేర్కొంది. ఇటీవల ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు నిలిపివేస్తూ అధికారులు ప్రకటన విడుదల చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది .ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, విద్యా శాఖ కమిషనర్ యోగితా రాణాతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. విలీనంతో ముడిపడిన పలు సాంకేతిక సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించారు. విలీన ప్రక్రియకు సంబంధించి భాగస్వాములతో విస్తృతంగా సంప్రదింపులు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై నియమించిన కమిటీ అధ్యయనం చేసి తన నివేదిక సమర్పించాలని సీఎం సూచించారు. అనంతరం శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## తక్షణమే రాష్ట్ర హోదా ఇవ్వాలి

మొదటి తరువాయి

విషాదాన్ని ప్రస్తావిస్తూ... శాంతిభద్రతల విషయంలో ఎన్నికైన ప్రతినిధులను దూరంగా ఉంచడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని చెప్పారు. జమ్మూ కాశ్మీర్ పరిమాణం, విస్తీర్ణత దృష్ట్యా, పరిపాలనకు ఎన్నికైన ప్రతినిధులే పూర్తి బాధ్యత వహించే పాలనా నమూనా అవసరమని చెప్పారు. పరిపాలనా వ్యవహారాల నిర్వహణ నియమాలపై కేంద్రంతో ఉన్న విభేదాలను తగ్గించడంలో గణనీయమైన పురోగతి సాధించినట్లు చెప్పారు. విశ్వవిద్యాలయాలు, షేర్-ఎ-కాశ్మీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, విద్యుత్ అభివృద్ధి సంస్థ వంటి అనేక కీలక సంస్థలు స్వయంచాలకంగా ఎన్నికైన ప్రభుత్వ పరిధిలోకి రావాల్సి ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల ఏకపక్ష తొలగింపులు అసంబద్ధం న్యాయ విచారణ లేకుండా ప్రభుత్వ ఉద్యోగులను కేంద్రం ఏకపక్షంగా తొలగించడం అసంబద్ధంగా, అస్పష్టంగా ఉందని, ఇది న్యాయ సమీక్షలో నిలబడే అవకాశం లేదని అబ్దుల్లా చెప్పారు.

# సామాజిక సేవా పథంలో నీల రవీందర్

**షాద్‌నగర్, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రముఖ సామాజికవేత్త నీల రవీందర్ జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పరిగి రోడ్, పోచమ్మగుడి సమీపంలో సేవా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. శ్రీనివాస్ చారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ఆదివారం బాటసారుల దాహార్తిని తీర్చేందుకు భారీ ఎత్తున మజ్జిగ వితరణ నిర్వహించారు. ఎండలు తీవ్రంగా ఉన్న వేళ ప్రజలకు ఉపశమనం కలిగించే ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎల్కుర్తి నారాయణ, హన్మారి మురళీధర్, చెరుకుపల్లి సురేష్, చెరుకుపల్లి శ్రీనివాస్, గడ్డం ఆంజనేయులు, యోగా గురువు గవయ్య పంతులు, గార్లపాటి శ్రీనివాస్, శివ కరుణాకర్,



గుండ్ల ప్రకాష్, శ్రీకాంత్, ఉప్పల సత్యం, కట్ట పుల్లయ్య, నీల సంగమేశ్వర్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని మరింత ఉత్సాహభరితంగా తీర్చిదిద్దారు. వాసవి క్లబ్ ప్రతినిధులు కూడా సంఘీభావం ప్రకటిస్తూ చురుగ్గా పాల్గొన్నారు. అధ్యక్షుడు గుంత సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గజవాడ యశ్వంత్ రాజ్, కోశాధికారి సోమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో యువకులు, సభ్యులు మజ్జిగ పంపిణీని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "నీల రవీందర్ సామాజిక సేవలు నిరంతరం కొనసాగాలని, మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని" ఆకాంక్షించారు. పట్టణ ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాటసారులకు మజ్జిగ పంపిణీ చేసి సేవా కార్యక్రమాన్ని ఘనవిజయవంతం చేశారు.

# మర్రిగూడను రంగారెడ్డిలో విలీనం చేయాలి

**మర్రిగూడ, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండలాన్ని రంగారెడ్డి జిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ మండల చౌరస్తాలో భారీ ప్రజా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి బిచ్చు నాయక్, మారగొని సుధీర్ కుమార్, వట్టిపల్లి గ్రామపంచాయతీ మాజీ ఉప సర్పంచ్ రామావత్ ధర్మనాయక్ ఆధ్వర్యం వహించారు. ప్రస్తుతం నల్గొండ జిల్లా కేంద్రానికి ప్రజలు చాలా దూరం ప్రయాణించాల్సి వస్తోందని, పరిపాలనా సేవలు అందుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా మాత్రం మర్రిగూడకు భౌగోళికంగా దగ్గరగా ఉండటంతో ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని, పరిపాలనా పనులు



వేగంగా పూర్తవుతాయని పేర్కొన్నారు. విలీనం జరిగితే పరిశ్రమలు, కంపెనీలు స్థాపించబడి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని, రైతులకు భూముల ధరలు పెరగడం ద్వారా ఆర్థిక లాభం కలుగుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. రోడ్లు, విద్యుత్, తాగునీరు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి కూడా వేగవంతం అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు "మర్రిగూడను రంగారెడ్డిలో కలపాలి", "మా మండలానికి అభివృద్ధి కావాలి", "యువతకు ఉద్యోగాలు ఇవ్వాలి" అంటూ నినాదాలు చేశారు. త్వరలోనే ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, సామాజిక సంఘాలు, మేధావులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి ప్రభుత్వంపై కార్యాచరణను నిర్ణయించనున్నట్లు నాయకులు ప్రకటించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఘన సన్మానం



**పెద్దపల్లి, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : పెద్దపల్లి పట్టణంలోని అమర్‌చంద్ కళ్యాణ మండపంలో పదవ తరగతిలో 500 పైగా మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల 98 మంది విద్యార్థులను ఘనంగా సన్మానించారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు విద్యార్థులకు శాలువాలు కప్పి, మెమెంటోలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ప్రతిభ కనబరచిన విద్యార్థులు సమాజానికి ఆదర్శమని, కష్టపడి సాధించిన విజయాలు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని అన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు కొనసాగించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గర్వకారణం కావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొంకూరి అవినాష్, మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, మండల విద్యాధికారి, పలు గ్రామాల సర్పంచులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి సన్మానించడం పాఠశాల వాతావరణాన్ని ఉత్సాహభరితంగా మార్చింది.

## నేటి నుండి భక్తాంజనేయస్వామి దివ్య ప్రతిష్ఠాపన మహోత్సవాలు

**ఎలిగేడు, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ముప్పిరితోట గ్రామంలోని నూతన ఆలయంలో భక్తాంజనేయస్వామి దివ్య పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు ఈ నెల 11వ తేదీ నుండి 13వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ఈ



ముప్పిరి తోటలో నూతనంగా నిర్మించిన భక్తాంజనేయ స్వామి ఆలయం

కార్యక్రమాన్ని తోగుట--రంగంపేట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి చేతుల మీదుగా శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదాన సేవలు జరుగుతాయని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రకటించింది. భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కమిటీ కోరింది.

# అకాడమీల పేరిట ఇంటర్ అడ్మిషన్లు


**- ఎస్ఎఫ్ఐ ఆగ్రహం**




**కరీంనగర్, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ పట్టణంలో అనుమతులు లేకుండా అకాడమీల పేరిట ఇంటర్ అడ్మిషన్లు చేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంకమ్మతోటలో జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పర్మిషన్ లేని కళాశాలలకు ప్రజా ప్రతినిధులు వెళ్లి ఓపెనింగ్ చేయడం సిగ్గుచేటు అని విమర్శించారు. అకాడమీల పేరుతో నడుస్తున్న కళాశాలల్లో ఇంటర్మీడియట్ అధికారులు కనబడకపోవడం, తల్లిదండ్రులను మోసం చేస్తూ అధిక ఫీజులు వసూలు చేయడం, అనుమతులు లేకుండా హోర్డింగులు, సోషల్ మీడియాలో ప్రచారం చేయడం జరుగుతోందని ఆరోపించారు. ఒక కళాశాలకు పర్మిషన్ ఉండి బ్రాంచీల పేరిట అపార్ట్మెంట్లలో తరగతులు ప్రారంభించడం, అడ్మిషన్ ఒక పేరు మీద చేసి సర్టిఫికెట్ వేరే కళాశాల పేరుతో ఇవ్వడం వంటి అవకతవకలు కరీంనగర్‌లో జరుగుతున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి కేసులు నమోదు చేయాలని, లేకపోతే అనుమతులు లేని అకాడమీలపై దాడులు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్, ఉపాధ్యక్షుడు అసంపల్లి వినయ్, సహాయ కార్యదర్శి భోగేశ్వర్, కమిటీ సభ్యులు సందేశ్, రోహిత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు. అనుమతులు లేని అకాడమీలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ స్పష్టంగా డిమాండ్ చేసింది.

# రిపోర్టర్ కుటుంబాన్ని పరామర్శించిన సంతోష్ రావు

**ఎలిగేడు, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యాచారం మండలంలోని ముప్పిరితోట గ్రామంలో రిపోర్టర్ ఆషాడపు సందీప్ తండ్రి ఆషాడపు పెద్ద వెంకటయ్య ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో



ఆదివారం దినకర్మ సందర్భంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు దుగ్యాల సంతోష్ రావు కుటుంబాన్ని పరామర్శించారు. వెంకటయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

**మాడ్గులపల్లి, మే 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శాస్త్రోక్తంగా, అత్యంత వైభవంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమానికి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, "ఆంజనేయ స్వామి భక్తులకు బుద్ధి, బలం, ధైర్యం ప్రసాదించే దైవం. భక్తి, సేవాభావంతో నిర్మించిన ఈ ఆలయం ప్రాంతానికి ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందాలి" అని ఆకాంక్షించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, దాతలను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, వేదపండితులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పోలీస్ ఉద్యోగ సాధనలో నిరుద్యోగ యువతకు అండగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**కల్వకుర్తి, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామీణ నిరుద్యోగ యువత పోలీస్ ఉద్యోగాల సాధనలో ముందుకు సాగేందుకు అవసరమైన సహకారం అందిస్తూ ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పోలీస్ శిక్షణా కేంద్రంలో ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "గ్రామాల్లో ప్రతిభ, పట్టుదల ఉన్నప్పటికీ సరైన మార్గదర్శకత్వం, నాణ్యమైన శిక్షణ, అధ్యయన వనరులు అందుబాటులో లేక చాలామంది వెనకబడుతున్నారు. అలాంటి యువతకు తోడ్పాటును అందించాలనే సంకల్పంతోనే ఉచిత శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేశాం. కేవలం కోచింగ్ మాత్రమే కాకుండా నాణ్యమైన స్టడీ మెటీరియల్ కూడా అత్యంత అవసరం. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పుస్తకాలు కొనలేని పరిస్థితులు ఎవరి లక్ష్యాలకు అడ్డంకి కాకూడదు. అందుకే ఉచితంగా మెటీరియల్ అందిస్తున్నాం" అని తెలిపారు. అభ్యర్థులు మాట్లాడుతూ, "ఉచిత శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్ అందించడం మా ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగ సాధనలో విజయాన్ని సాధిస్తాం" అని ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ బృందం, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

**-- కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి**



**మర్రిగూడ, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మునుగోడు నియోజకవర్గ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మర్రిగూడ మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి. తేమ శాతం పేరుతో వేధించకుండా, పండించిన ప్రతి గింజను మద్దతు ధరకు సేకరించాలి. రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి ఎండల తీవ్రతలో ఇబ్బందులు లేకుండా చూడాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగన్, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు చెరుకు శ్రీరామ్ గౌడ్, నల్ల యాదయ్య గౌడ్, వార్డు సభ్యుడు కొండాపురం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# చౌదర్‌పల్లి మాజీ సర్పంచ్ కేశమోని కిష్టయ్య గౌడ్ మృతి

**ఇబ్రహీంపట్నం, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యాచారం మండలం చౌదర్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ కేశమోని కిష్టయ్య గౌడ్ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్ చౌదర్‌పల్లికి చేరుకుని ఆయన




పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, గ్రామ ప్రజలతో కలిసి ఆయన సేవలను స్మరించారు.

## యాచారం మండలం నుండి మోదీ సభకు భారీగా తరలిన బీజేపీ శ్రేణులు



**యాచారం, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభకు యాచారం మండలం నుండి బిజెపి కార్యకర్తలు విపరీతంగా తరలివెళ్లి పార్టీ శక్తిని ప్రదర్శించారు. మండల అధ్యక్షుడు విజయ్ నాయక్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల నుండి దాదాపు 500 మందికి పైగా కార్యకర్తలు, యువ నాయకులు, మహిళలు స్వచ్ఛందంగా సభకు హాజరయ్యారు. భారీ కాన్వాయ్‌లతో, బిజెపి జెండాలు, నినాదాలతో సభా ప్రాంగణానికి చేరుకున్న కార్యకర్తలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నాయకులు మాట్లాడుతూ, “దేశ అభివృద్ధి, పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, యువతకు ఉపాధి కల్పించడంలో మోదీ నాయకత్వం దేశాన్ని గౌరవప్రద స్థానంలో నిలబెట్టింది. తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. రాబోయే రోజుల్లో బిజెపి ప్రభుత్వం ఖాయం” అని ధీమా వ్యక్తం చేశారు. సభలో పాల్గొన్న నాయకుల్లో నాగిని యాదయ్య, ఆంబోజి జగదీశ్ యాదవ్, సర్పంచులు రమాదేవి మల్లారెడ్డి, ఆంబోజు రమేష్, నీలం ఝాన్సీ రమేష్, తాంద్ర రవీందర్, పగడాల శ్రీశైలం, నడికుడి కృష్ణ, గౌర లక్ష్మణ్, బొడ్డు బాషా, సాటు మల్లేష్ తదితరులు ఉన్నారు. “దేశం కోసం మోదీ -- మోదీ కోసం ప్రజలు” అనే నినాదాలతో సభలో ఉత్సాహం నిండిపోగా, యాచారం మండలం నుండి భారీ సంఖ్యలో హాజరైన కార్యకర్తలు పార్టీకి కొత్త ఉత్సాహాన్ని నింపారని నాయకులు పేర్కొన్నారు.

## వెల్దండ ఎస్సైగా యుగేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ



**వెల్దండ, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ నూతన ఎస్సైగా యుగేందర్ రెడ్డి ఆదివారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు వెల్దండ ఎస్సైగా పనిచేసిన కురుమూర్తి కల్వకుర్తి ఎస్సైగా బదిలీ అయ్యారు. యుగేందర్ రెడ్డి వెల్దండలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “మండలంలోని శాంతిభద్రత పరిరక్షణకు కృషి చేస్తాను. అసాంఘిక కార్యకలాపాలు, జూదం, అక్రమ మద్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాను” అని తెలిపారు. అనంతరం పోలీస్ సిబ్బంది నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు.

## జిల్లా యువజన కాంగ్రెస్ కమిటీలో నూతన ప్రధాన కార్యదర్శులు నియామకం



**కరీంనగర్, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ కమిటీలో ప్రధాన కార్యదర్శులుగా చేవెళ్ల మల్లికార్జున్, అహ్మద్ అలీ ఖాద్రి (సుఫియాన్) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ పడాల రాహుల్ వారిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. యువజన కాంగ్రెస్‌లో మరింత చురుకుగా పని చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి తోడ్పడాలని అన్నారు. ఎన్ఎస్‌యుఐలో కష్టపడితే పార్టీలో, ప్రభుత్వంలో ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉందని, 2029లో రాహుల్ గాంధీని ప్రధానిగా చేయాలనే లక్ష్యంతో పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. జిల్లా యువజన కాంగ్రెస్‌లో కొత్త ప్రధాన కార్యదర్శుల నియామకంతో శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

# బీసీల హక్కుల కోసం జేఏసీ నల్ల బ్యాడ్జీలతో నిరసన

**హుస్నాబాద్, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన సందర్భంగా బీసీల రిజర్వేషన్లపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ హుస్నాబాద్ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి రాష్ట్రానికి వస్తున్న మోదీ దృష్టికి బీసీల సమస్యలను తీసుకెళ్లేందుకు ఈ నిరసన చేపట్టినట్లు నాయకులు తెలిపారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు, తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చడం, జనగణనలో కులగణన, ప్రత్యేక బడ్జెట్, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు, బీసీ రక్షణ చట్టం, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పునఃసమీక్ష, మండల్ కమిషన్ సిఫార్సుల అమలు, ప్రమోషన్లలో రిజర్వేషన్లు, క్రిమిలేయర్ రద్దు, ఉన్నత న్యాయస్థానాల్లో బీసీలకు ప్రాతినిధ్యం వంటి డిమాండ్లను ప్రధానికి వినిపించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ కన్వీనర్ మేకల వీరన్న యాదవ్, బీఎస్పీ ఇంచార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్,



మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వడ్డేపల్లి వెంకటరమణ, మహమ్మద్ హాసన్, వెన్న రాజు, కౌన్సిలర్లు పూదరి వరప్రసాద్, కేశవేణి రమేష్, బోలిశెట్టి రాజు, గోపగాని శోభన్ బాబు, జేఏసీ నాయకులు ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, నాంపల్లి సమ్మయ్య, మెతుకు కొమురయ్య, చింతల రాంచంద్రం, బూర వెంకన్న, పూదరి శ్రీనివాస్ గౌడ్, గట్టు రాములు గౌడ్, గాజుల భగవాన్, చెన్నబోయిన విద్యాసాగర్, కొండ సత్యనారాయణ, లైబ్రరీ నారాయణ, మహమ్మద్ ఇంతియాజ్, దుబాల శ్రీను, పశ్చిమట్ల వెంకటేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. బీసీల హక్కుల కోసం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేసిన జేఏసీ, ప్రధాని మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేసింది.

## ఘనంగా హనుమాన్ భక్తుల శోభాయాత్ర



**రామడుగు, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రామడుగు మండలంలోని రామచంద్రాపూర్ గ్రామంలో ఆదివారం హనుమాన్ భక్తుల శోభాయాత్ర ఘనంగా జరిగింది. భక్తులు భక్తి పరవశంలో జై హనుమాన్ నినాదాలు చేస్తూ ఊరంతా శోభాయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని హనుమాన్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. రామచంద్రాపూర్ గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర భక్తి శ్రద్ధలతో విజయవంతంగా ముగిసింది.

## హుస్నాబాద్‌లో మార్ఫింగ్ నిందితుడికి రిమాండ్



**హుస్నాబాద్, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
విద్యుత్ శాఖ కార్యాలయంలో మహిళా ఉద్యోగుల ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసిన ఘటనలో పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. నిందితుడు శ్రీబద్రి మహేష్‌ను ఆదివారం అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. హనుమకొండ జిల్లా వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామానికి చెందిన మహేష్ (39) హుస్నాబాద్ విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఆర్టిజన్‌గా పనిచేస్తున్నాడు. కార్యాలయ మహిళా ఉద్యోగుల ఫొటోలు, బంధువుల వాట్సాప్ స్టేటస్ చిత్రాలు, సోషల్ మీడియాలోని ఫొటోలను రహస్యంగా సేకరించి ఫోటో ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్ సాయంతో అసభ్యకరంగా మార్ఫింగ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం వెలుగులోకి రావడంతో డీఈ కృష్ణయ్య ఫిర్యాదు మేరకు హుస్నాబాద్ ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి కేసు నమోదు చేశారు. సీఐ కొండ్ర శ్రీను ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించారు. అనంతరం సిద్ధిపేట జిల్లా జైలుకు తరలించారు. సీఐ కొండ్ర శ్రీను మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేసి మహిళల గౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. మహిళల వ్యక్తిగత ఫొటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా ప్రచారం చేయడం ఐటీ చట్టం కింద కఠిన శిక్షలకు గురి చేస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి ఇలాంటి చర్యలకు పాల్పడటం అత్యంత ఖండనీయమని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## కొనుగోలు కేంద్రాలలో సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందుల్లో రైతులు



**హుస్నాబాద్, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: కోహెడ మండలంలోని 27 గ్రామాల రైతుల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోందని రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కోహెడ మార్కెట్ యార్డును సందర్శించిన ఆయన మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ సరైన సౌకర్యాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంట పొలాల్లో పండించిన వరి ధాన్యం కొనుగోలు ఆలస్యంతో గోదాముల్లో, ఇండ్ల వద్ద, కొన్నిచోట్ల పొలాల దగ్గరే పేరుకుపోతుందని చెప్పారు. ఎండ తీవ్రతలో వడ్లు ఎండబెట్టడం, రాత్రిళ్లు పంటకు కాపలా కాయడం రైతుల నిత్యకృత్యంగా మారిందన్నారు. ఒకవైపు వర్షం వస్తే పంట నష్టపోతుందనే భయం, మరోవైపు ఎండలో ఎక్కువసేపు ఉంచితే నాణ్యత తగ్గుతుందనే ఆందోళన రైతులను మానసికంగా కుంగదీస్తోందని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలను గమనించినా స్పందించడం లేదని విమర్శించారు. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆచరణలో మాత్రం రైతులను నిరాశపరుస్తోందని అన్నారు. కొనుగోలు ప్రక్రియను వెంటనే వేగవంతం చేసి రైతులకు భరోసా కల్పించాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, స్థానికులు పాల్గొన్నారు. పంట పండించడం కంటే అమ్ముకోవడమే భారమైపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అవ్వారి లక్ష్మమ్మ పార్థివ దేహానికి నివాళి



**ఆమనగల్లు, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీ 15వ వార్డు ఉదయ్ నగర్ కాలనీకి చెందిన అవ్వారి లక్ష్మమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము ఆదివారం మృతురాలు లక్ష్మమ్మ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. అధైర్య పడకండి అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఆయన వెంట శ్రీను నాయక్ తదితరులు ఉన్నారు.

## బండి రమేష్ కి అభినందనలు వెల్లువ.

**కూకట్పల్లి మే 10 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నూతనంగా కమ్మ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన బండి రమేష్ కి అభినందనలు వెల్లువ కొనసాగుతోంది. నియోజకవర్గ పరిధిలోని బాలాజీ నగర్ కమ్మ సంఘం తో పాటు ఈసీఐఎల్ కమ్మ సంఘం నాయకులు ఆదివారం బండి రమేష్ నీ నియోజకవర్గ పార్టీ కార్యాలయం హేమ దుర్గా భవన్లో కలిసి పూల బొకే ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు . అభినందనలు తెలియజేశారు. బాలాజీ నగర్ లో నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. కాలనీ సమస్యలను పరిష్కరించేందుకు త్వరలో పాదయాత్ర నిర్వహిస్తానని రమేష్ తెలిపారు.

# మాదిగ మహాశక్తి సభ విజయవంతం చేయాలని పిలుపు

**పెద్దపల్లి, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**: ఈనెల 17న జిల్లా కేంద్రంలోని ఏంబీ గార్డెన్‌లో జరగనున్న పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలిమాదిగ మహాశక్తి సభలిను విజయవంతం చేయాలని మాదిగ మహాశక్తి కోర్ కమిటీ సభ్యుడు ఆసంపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు మాదిగలే ఉన్నా రాజకీయంగా, సామాజికంగా అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగలను గుర్తించే పార్టీలకు ఓటు వేస్తామని, వ్యతిరేకించే పార్టీలను తరిమికొడతామని తెలిపారు. మాదిగల ఓటు మాదిగలకే అనే నినాదంతో సభను




నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సభకు మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆ రోజు మాదిగ సామాజిక వర్గంలో వివిధ రంగాల్లో రాణించిన ఉద్యోగులు, సామాజికవేత్తలు, విద్యార్థులను సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం వైస్ ప్రెసిడెంట్ మామిడిపల్లి బాపయ్య, కుక్క ఆశోక్, కొంకటి లింగమూర్తి, ఏఐఎఫ్‌బీ పార్టీ నాయకులు కుక్క శ్రావణ్‌కుమార్, మైస రాజేష్, ఆర్నకొండ వెంకన్న, శ్రావణ్, విజయ్, శ్రీనాథ్, తిరుమల్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున మాదిగలు తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని కోర్ కమిటీ పిలుపునిచ్చింది.

# ప్రధాని మోదీ సభకు భారీ ఎత్తున తరలి వెళ్లిన బీజేపీ శ్రేణులు

**కరీంనగర్/హుస్నాబాద్, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**: హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన ప్రధాని నరేంద్ర మోదీ జనాగ్రహ సభకు కరీంనగర్ జిల్లా, హుస్నాబాద్ నియోజకవర్గం నుండి బీజేపీ శ్రేణులు భారీ ఎత్తున తరలి వెళ్లారు. కరీంనగర్ నుండి బయలుదేరిన వాహన శ్రేణిని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధాని మోదీ తొలిసారి తెలంగాణకు వచ్చి దాదాపు తొమ్మిది వేల కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం చేయనున్నారని తెలిపారు. ఈ సభను చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్వహించేందుకు రాష్ట్ర పార్టీ ప్రత్యేకంగా ఆలోచించిందని, తెలంగాణలో బీజేపీని బలోపేతం చేసే లక్ష్యంతో ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారని అన్నారు. జిల్లా పార్టీ ఆధ్వర్యంలో 120 ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ బస్సులు, దాదాపు 500





కార్లలో కార్యకర్తలు, ప్రజలు సభకు చేరుకున్నారు. సభ అనంతరం తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులు సంభవించే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. హుస్నాబాద్ మండలంలో కూడా మండల అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా వాహనాల్లో బయలుదేరారు. ఆయన మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి దిశగా ముందుకు నడిపిస్తున్న ప్రధాని మోదీ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వినేందుకు ప్రజలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మండల స్థాయి నేతలు, కౌన్సిల్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రధాని మోదీ సభకు కరీంనగర్ జిల్లా, హుస్నాబాద్ నియోజకవర్గం నుండి బీజేపీ శ్రేణులు భారీ ఎత్తున తరలి వెళ్లి సభను విజయవంతం చేశారు.

# కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద 830 కిలోల సారా ముడి పదార్థాల స్వాధీనం



**ఆమనగల్లు, మే 10 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ అధికారులు అదివారం కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో సారా తయారీకి తరలిస్తున్న భారీ మొత్తంలో ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బధ్యనాథ్ చౌహాన్ తెలిపారు. హైదరాబాద్ నుంచి వివిధ గ్రామాలకు నల్ల బెల్లం, పట్టిక తరలిస్తున్నారనే సమాచారంతో ఇన్‌స్పెక్టర్ బద్యానాయక్ చౌహాన్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా టోల్ గేట్ వద్ద ఆపిన మారుతి ఎర్టిగా వాహనం (టీజీ 31 టీ 0225)ను తనిఖీ చేయగా 30 బాక్సుల్లో ఒక్కోటి 25 కిలోల చొప్పున మొత్తం 750 కిలోల నల్ల బెల్లం, రెండు సంచుల్లో 80 కిలోల పట్టిక లభ్యమయ్యాయి. మొత్తం 830 కిలోల ముడి పదార్థాలను, రెండు మొబైల్ ఫోన్లు మరియు వాహనాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కేతావత్ మోహన్, దేరంగుల నరేష్ అనే ఇద్దరిని అరెస్టు చేశారు. వాహన తనిఖీల్లో ఎస్ఐ అరుణ్ కుమార్, చెన్నయ్య హెచ్‌సీ, రామ్‌రెడ్డి, లింగయ్య, శివప్రసాద్, శ్రీను, ఆమని తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో సుందరకాండ
# ప్రవచన జ్ఞాన యజ్ఞం



**కరీంనగర్, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో నాలుగో రోజు సుందరకాండ ప్రవచన జ్ఞాన యజ్ఞం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా. వి. నరేందర్ రెడ్డి కుటుంబంతో కలిసి పాల్గొని భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. శ్రీరాముని ఆరాధించడం వలన సకల శుభఫలాలు కలుగుతాయని, శ్రీరాముడు ధర్మానికి ప్రతీక, సత్యానికి నిర్వచనమని ఆయన పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి రచించిన సుందరకాండను పఠించడం లేదా వినడం వలన మానసిక, శారీరక శక్తి పెరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ శ్రీరాముని ఆదర్శంగా తీసుకొని ఆయన గుణాలను అలవర్చుకుంటే సమాజంలో భేదభావాలు తొలగిపోతాయని అన్నారు. బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రపెల్లి మహేశ్వర శర్మ మార్గదర్శకత్వంలో జరుగుతున్న ఈ ప్రవచనాన్ని సద్వినియోగం చేసుకొని రోజు వారీ జీవితంలో అవలంబించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా జరిగిన భజనలు భక్తులను ఉత్సాహపరిచాయి. ఈ యజ్ఞంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆధ్యాత్మిక కేంద్రాల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు. సుందరకాండ ప్రవచన జ్ఞాన యజ్ఞం భక్తి వాతావరణంలో విజయవంతంగా కొనసాగుతోంది.

# గాయత్రి వయోవృద్ధుల సంఘం ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలు

**కరీంనగర్, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా గాయత్రి వయోవృద్ధుల సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ కమాన్ రోడ్‌లోని రామేశ్వర ఆలయంలో ఆదివారం రాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి మాట్లాడుతూ తల్లిదండ్రులను వేధించకూడదని, వారు మన జన్మకు కారణమని, అష్టకష్టాలు పడి పెంచిన మాతృమూర్తులను గౌరవించాలని సూచించారు. వృద్ధులు, తల్లిదండ్రుల పోషణ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తామని



తెలిపారు. కార్యక్రమంలో 60 సంవత్సరాలు దాటిన 103 మంది వృద్ధ మాతృమూర్తులను సంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. ప్రత్యేక అతిథులుగా సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కేశవరెడ్డి, ప్రణామ్ డే కేర్ సెంటర్ ఉపాధ్యక్షుడు అంజయ్య పాల్గొన్నారు. నిర్వాహకులు ఉప్పల రామేశం మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా వృద్ధ మాతృమూర్తులను సత్కరిస్తున్నామని తెలిపారు. కోశాధికారి బొడ్ల ప్రభాకర్ వందన సమర్పణ చేశారు. మాతృమూర్తులను గౌరవిస్తూ మాతృ దినోత్సవ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

# ఘనంగా అవంతిక తెలంగాణ ప్రోమో రన్




**కరీంనగర్, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**: అంబేద్కర్ స్టేడియంలో ఆదివారం ఉదయం 'అవంతిక తెలంగాణ రన్' ప్రోమో రన్ ఉత్సాహంగా జరిగింది. అవంతిక కన్స్ట్రక్షన్స్ సమర్పణలో, తెలంగాణ రన్నర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కరీంనగర్ టూర్ 2026 కార్యక్రమంలో యువత, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని 10కే, 5కే విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షత వహించగా, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్‌ను జీవనశైలిలో భాగం చేసుకోవాలని, ఇలాంటి క్రీడా కార్యక్రమాలు యువతలో స్ఫూర్తిని నింపుతాయని అన్నారు. నిర్వాహకులు జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, కరీంనగర్ ప్రజల నుంచి లభించిన స్పందన అద్భుతమని హర్షం వ్యక్తం చేశారు. అవంతిక తెలంగాణ ప్రోమో రన్‌తో కరీంనగర్‌లో క్రీడా వాతావరణం ఉత్సాహభరితంగా మారింది.

# ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం

**- సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**
**- తాగునీటి శుద్ధి కేంద్రం ప్రారంభం**



**ఆమనగల్లు, మే 10 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ పని చేస్తోందని ఆ ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం వెల్దండ మండలం పోచమ్మ గడ్డ తండాలో ఐక్యత ఫౌండేషన్ సహకారంతో రూ. 1.50 లక్షలతో తాండలో త్రాగునీటి శుద్ధి కేంద్రం (వాటర్ ప్లాంట్) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు కలుషిత నీరు తాగి అనారోగ్యం పాలు కాకుండా శుద్ధి చేసిన సురక్షితమైన నీరు తాగాలని అన్నారు. ప్రజలు తమ ఇళ్ల ముందు నీరు నిల్వ ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్లు గన్య నాయక్, రమేష్ నాయక్, మహిపాల్, ఉప సర్పంచ్ గోపాల్, మాజీ సర్పంచ్ పంతుల నాయక్, వార్డు మెంబర్ శ్రీరామ్ నిర్మలా, హనుమంత్, సీనియర్ నాయకులు వెంకట్ నాయక్, సేవ్యా నాయక్, రేక్యనాయక్, మున్య నాయక్, జైపాల్, తిరుపతి, శ్రీను నాయక్, లక్ష్మణ్ నాయక్, శ్రీనునాయక్ లతో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, తండా పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మోదీ సభకు తరలిన బీజేపీ శ్రేణులు





**ఆమనగల్లు, మే 10 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ఆదివారం ఆమనగల్లు బీజేపీ శ్రేణులు భారీ ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నేతలు మాట్లాడుతూ.. పశ్చిమబెంగాల్ లో మొదటిసారిగా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనంతరం ప్రధాని తెలంగాణలో అడుగు పెడుతున్నారని, రాబోవు ఎన్నికలలో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే ప్రధాని లక్ష్యమన్నారు. ప్రధాని సభ రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటుకు నాంది అన్నారు. తరలిన వారిలో సీనియర్ నాయకులు గోరటి నర్సింహా, భీమనపల్లి దుర్గయ్య, చెన్నకేశవులు, జంతుక జానయ్య, కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్, నాయకులు లండం చంద్రయ్యా, కర్ణాకర్, నరేష్, భరత్ తదితరులు ఉన్నారు.

# తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర మహాసభలకు విజయవంతం చేయాలని పిలుపు

**కరీంనగర్, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మే 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ కళాకారులకు పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా సిపిఐ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఉమ్మడి జిల్లా కళాకారుల శిక్షణా శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా పల్లె నర్సింహ కళాకారులకు పాటలు పాడటం, డప్పు కొట్టడం శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజా కళాకారులు ప్రజల బాధలను చూసి వాటిని ప్రపంచానికి తెలియజేయడం తమ ధ్యేయమని, కళ కాసుల కోసం కాదు ప్రజల కోసమే పాడే కళాకారులే ప్రజానాట్య మండలి వారని అన్నారు. జానపద, యక్షగాన, బుర్రకథ, ఒగ్గుకథ, వీధి బాగోత కళాకారుల జీవన పరిస్థితులు దుర్భరంగా ఉన్నాయని, వారిని ప్రభుత్వం గుర్తించి గుర్తింపు కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాలను పాటల రూపంలో




బయటకు తెచ్చే శక్తి కళాకారులదేనని, ఉద్యమాలు విజయవంతం కావాలంటే కళాకారులు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇప్టా జాతీయ కౌన్సిల్ సభ్యుడు కవ్వంపల్లి స్వామి, మాజీ జడ్పీటీసీ అందె స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నం లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి దుడ్డేల సమ్మయ్య, కళాకారులు లెనిన్, వరకోలు సదానందం, కోమల, సరిత, రమ, రాజయ్య, విజయ్, తిరుపతి, లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో జరగనున్న ప్రజానాట్య మండలి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పల్లె నర్సింహ పిలుపునిచ్చారు.

# మదర్స్ డే సందర్భంగా మాతృమూర్తులకు ఘన సన్మానం



**కరీంనగర్, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
లయన్స్ ఇంటర్నేషనల్ 320జి రీజియన్ టూ 2026--27 సంవత్సర కాలానికి పిఎస్టీల ప్రత్యేక సమావేశం కరీంనగర్ శ్రీనిధి చిట్‌ఫండ్ సమావేశ మందిరంలో రీజనల్ చైర్‌పర్సన్ రాళ్లబండి శంకర ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో క్లబ్బుల అభివృద్ధి, సభ్యత్వం పెంపు, సేవా కార్యక్రమాలపై చర్చ జరిగింది. రీజియన్ సెక్రటరీ నరహరి లక్ష్మారెడ్డి, జోన్ సెక్రటరీలు శంకర్, శరత్, రాజశేఖర్, లయన్స్ జిల్లా పెద్దలు సిహెచ్, సుదీర్‌రావు, పుల్లూరి ప్రభాకర్, రమేష్, వెంకటేశ్వర్లు, వివిధ క్లబ్బుల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మదర్స్ డే సందర్భంగా రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాతృమూర్తులను ఘనంగా సన్మానించారు. మదర్స్ డే వేడుకల్లో మాతృమూర్తుల గౌరవం ప్రతిష్టాత్మకంగా నిలిచింది.

# జనగణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**- కలెక్టర్ కె. హైమావతి**

**సిద్దిపేట, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: జనగణన సమగ్ర, ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో కీలకమని, దేశవ్యాప్తంగా నిర్వహించనున్న ఈ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి మాద్రన్ బస్టాండ్ వరకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2021లో జరగాల్సిన జనగణన కోవిడ్ కారణంగా వాయిదా పడిందని, స్వాతంత్ర్యం అనంతరం ఇది దేశంలో 16వ జనగణనగా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తర్వాత జరుగుతున్న తొలి జనగణనగా నిలుస్తోందని తెలిపారు. తొలిసారిగా డిజిటల్ విధానంలో జనగణన చేపట్టడం ప్రత్యేకత అని, స్వీయగణన విధానం ద్వారా ప్రజలు తమ కుటుంబ వివరాలను తామే నమోదు చేసుకునే అవకాశం కల్పించామని చెప్పారు. ఇందులో




34 ప్రశ్నలు ఉంటాయని, కేవలం ఐదు నిమిషాల్లో పూర్తి చేయవచ్చని వివరించారు. మొబైల్ నంబర్ ద్వారా అధికారిక వెబ్‌సైట్‌లో లాగిన్ అయి స్వీయగణన పూర్తి చేయాలని సూచించారు. స్వీయగణనకు గడువు ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు మాత్రమేనని, సోమవారం నుంచి ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఇందుకోసం శిక్షణ పొందిన సిబ్బందిని నియమించామని, వారికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేశామని చెప్పారు. ఆ కార్డులపై ఉన్న క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి వారి వివరాలు ధృవీకరించుకోవచ్చని సూచించారు. జనగణన పేరుతో అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు హెచ్చరించారు. దేశ ప్రణాళికా రూపకల్పనకు జనగణన ఎంతో కీలకమని, అందరూ చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, డీఎస్‌సీడీఓ హవీద్, సెక్యూరిటీ అధికారి రామస్వామి, ఎంఈఓలు, ఎన్యూమరేటర్లు, పలు సంఘాల ప్రతినిధులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు. జనగణనలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# ధాన్యం తూకాల్లో మోసాలను సహించం

**- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**



**మానకొండూర్, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిమ్మాపూర్ మండలం రేణికుంటలోని ఓ ప్రైవేట్ రైస్ మిల్లును ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల నుంచి తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన మిల్లును పరిశీలించి, ఇకపై ఇలాంటి విధానాలకు స్వస్తి పలకాలని స్పష్టం చేశారు. అన్‌లోడింగ్‌లో జాప్యం జరగడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇకపై త్వరగా అన్‌లోడింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని మిల్లు యజమానిని, అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, ఉపాధ్యక్షుడు తమ్మనవేని రాములు యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎలుక రాజు, నాయకులు బొంగోని వీరయ్య, ఎడ్ల సురేందర్ రెడ్డి, బుర్ర అంజయ్య, బొంగోని సురేష్, చెక్కబండ సత్యనారాయణ రెడ్డి తదితరులు ఎమ్మెల్యేతో ఉన్నారు. ఆరోగ్య పరిరక్షణలోనూ, రైతు సమస్యల పరిష్కారంలోనూ చురుకుగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.

# రైస్ మిల్లుల్లో అగ్నిమాపక భద్రతాపై అవగాహన సదస్సు

**కరీంనగర్, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కరీంనగర్ జిల్లాలోని ఐదు అగ్నిమాపక కేంద్రాల అధికారులు, సిబ్బంది తమ పరిధిలో ఉన్న రైస్ మిల్లులు, పరిశ్రమల్లో అగ్నిప్రమాదాల నివారణపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిల్లుల యజమానులు, కార్మికులకు అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో పాటించాల్సిన భద్రతా చర్యలపై వివరించారు. విద్యుత్ వైరింగ్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం, షార్ట్ సర్క్యూట్‌ల నివారణ చర్యలు, ఫైర్ ఎక్స్టింగ్విషర్లు అందుబాటులో ఉంచడం, అత్యవసర నిష్క్రమణ మార్గాలను సక్రమంగా నిర్వహించడం వంటి అంశాలపై సూచనలు చేశారు. అగ్నిప్రమాదం



సంభవించినప్పుడు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడం, ప్రారంభ దశలోనే మంటలను అదుపు చేసే విధానాలపై ప్రత్యక్ష డెమో కూడా నిర్వహించారు. పరిశ్రమల్లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, అప్రమత్తతే ప్రమాద నివారణకు కీలకమని అధికారులు స్పష్టం చేశారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణే అగ్నిమాపక శాఖ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, మానకొండూరు ఇన్చార్జ్ సంతోష్, హుజురాబాద్ ఇన్చార్జ్ సురేందర్, చొప్పదండి ఇన్చార్జ్ లక్ష్మారెడ్డి, జమ్మికుంట ఇన్చార్జ్ రాజా వెంకటరెడ్డి, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు. అప్రమత్తతే అగ్నిప్రమాదాల నివారణకు కీలకం అని అధికారులు స్పష్టం చేశారు.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మే 11న విద్యా వారోత్సవాలు ప్రారంభం

**కరీంనగర్, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో(స్వయం ప్రతిపత్తి) విద్యా వారోత్సవాలు మే 11 నుంచి ప్రారంభం కానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం, కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి తెలిపారు. మే 11న విద్యా వారోత్సవాల ప్రారంభం, ఎంఓయూ మరియు ఇండస్ట్రీ పార్టనర్స్ సన్మానం జరుగుతుంది. మే 12న పిజి ఎంట్రన్స్ ప్రారంభం, యోగా శిక్షణ, ధ్యాన కార్యక్రమాలు ఉంటాయి. మే 13న గ్రామ స్థాయిలో ఎఈడిపి కోర్సులు, సర్పంచులతో అవగాహన సదస్సు నిర్వహిస్తారు. మే 14న ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మెగా సమావేశం, పూర్వ విద్యార్థినుల సన్మానం జరుగుతుంది. మే 15న గ్రంథాలయ జ్ఞానోత్సవం, పుస్తక ప్రదర్శన, మే 16న కృత్రిమ మేధపై అవగాహన సదస్సు, మే 17న విద్యా వారోత్సవాల ముగింపు సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థినులకు పురస్కార ప్రదానం జరుగుతుంది. ఈ కార్యక్రమాలు ప్రిన్సిపల్ డి. వరలక్ష్మి, కోఆర్డినేటర్ పి. స్వరూప, కమిటీ సభ్యులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఆధ్వర్యంలో జరుగుతాయి. పూర్వ విద్యార్థినులు, ప్రస్తుత విద్యార్థినులు, తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, పత్రిక ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ప్రిన్సిపల్ కోరారు. విద్యా వారోత్సవాలు విద్యార్థినుల ప్రతిభను వెలికితీసే వేదికగా నిలవనున్నాయి.

# కొండగట్టుకు పాదయాత్రగా హనుమాన్ భక్తులు

**ఎలిగేడు, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంలోని కోదండరామాలయం నుండి హనుమాన్ మాల ధరించిన భక్తులు ఆదివారం నిష్టతో కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు. ఆలయ ప్రధానార్చకులు గరిమెళ్ళ వెంకటేశ్వర్లు, మురళి స్వాములు భక్తులకు ఇరుముడు కట్టి ఆశీర్వదించారు. ఈ పాదయాత్రలో బుర్ర అజయ్, మండిగ ప్రవీణ్, చదల రాజు, కార్తీక్, బుర్ర సంతోష్, అఖిల్, రాజ్‌కుమార్, సూర్య, సాత్విక్, ఓంకార్, రాజయ్య తదితరులు పాల్గొని భక్తి ఉత్సాహాన్ని ప్రదర్శించారు.



ఇరుముడి కట్టుకున్న హనుమాన్ స్వాములు




పాదయాత్ర బయలుదేరిన హనుమాన్ భక్తులు

# రవి రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్

**-కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ శేక్షావల్లి ఆచారి**

**జోగులాంబ మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీలో వ్యాపార సంస్థ అధ్యక్షుడు ఏ సి సి రవి ప్రకాష్ రెడ్డి గారికి జన్మదిన వేడుకల్లో పాల్గొని శు భాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు 19వ వార్డు కౌన్సిలర్ షేక్షావలి ఆచారి ఈ కార్యక్రమంలో హమాలి సంఘం అధ్యక్షుడు ఈశ్వర్, మేస్త్రి గోవిందు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



## తిరుచ్చి తూర్పు అసెంబ్లీ స్థానానికి రాజీనామా చేసిన తమిళనాడు సీఎం విజయ్..!



**న్యూఢిల్లీ మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ స్థానాన్ని వదులుకున్నారు. పెరంబూర్ అసెంబ్లీ స్థానాన్ని ఆయన అట్టిపెట్టుకున్నారు. దాంతో తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ స్థానానికి ఆరు నెలల్లోగా ఉప ఎన్నిక నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది. తమిళనాడులో మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఏప్రిల్ 23న పోలింగ్ నిర్వహించారు. టీవీకే చీఫ్ విజయ్ తిరుచ్చి ఈస్ట్, పెరంబూర్ రెండు స్థానాల నుంచి పోటీచేశారు. మే 4న వెలువడిన ఫలితాల్లో ఆయన రెండు స్థానాల్లోనూ విజయం సాధించారు.అయితే ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఒక అభ్యర్థి ఒకేసారి రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయవచ్చు. ఒకవేళ ఆ రెండు సీట్లలోనూ గెలిస్తే ఒక దానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు తిరుచ్చి ఈస్ట్, పెరంబూర్ రెండు స్థానాల నుంచి గెలిచిన విజయ్ .. ఏదో ఒక స్థానానికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాంతో ఆయన తిరుచ్చి ఈస్ట్ స్థానాన్ని వదులుకున్నారు. పెరంబూర్ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగాలని నిర్ణయించుకున్నారు.

## పదిహేనేళ్ల బాలికపై బౌద్ధ సన్యాసి అత్యాచారం..

**సహకరించిన తల్లి..!**



**న్యూఢిల్లీ మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఓ పదిహేనేళ్ల బాలికను లైంగికంగా వేధించినట్లు శ్రీలంక కు చెందిన 71 ఏళ్ల బౌద్ధ సన్యాసి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో పల్లెగామ హేమరథ ను పోలీసులు అరెస్టు చేశారు. హేమరథ ప్రస్తుతం శ్రీలంకలోని ప్రసిద్ధ ఆలయానికి ప్రధాన భిక్షువుగా ఉన్నారు. హేమరథ అకృత్యానికి బాలిక తల్లే సహకరించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అనురాధపురలోని మేజిస్ట్రేట్ కోర్టు బాలిక తల్లిపైనా అరెస్టు వారెంటు జారీ చేసింది. హేమరథ ఆలయ ఆవరణలో ఒక బాలికను అపహరించి నిర్బంధించినట్లు గత మార్చి నెలలోనే ఫిర్యాదు నమోదైంది. విచారణలో మరిన్ని వివరాలు బయటకు వచ్చాయి. కొలంబోలోని ప్రైవేటు ఆసుపత్రి ఎమర్జెన్సీ యూనిట్‌లో చికిత్స పొందుతుండగా హేమరథనను, బాలిక తల్లిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.


## కాల్పుల విరమణపై ఇరాన్‌కు అమెరికా తాజా ప్రతిపాదనలు..

- స్పందించిన ఇరాన్



**న్యూఢిల్లీ మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమెరికా--ఇరాన్ మధ్య శాంతి చర్చలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. శాశ్వతంగా కాల్పుల విరమణ కోసం ఇరు దేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా కాల్పులు విరమణపై ఇరాన్‌కు అమెరికా ప్రతిపాదనలు పంపింది. తొమ్మిది అంశాలతో అమెరికా ప్రతిపాదనలు పంపింది. దీనిపై ఇరాన్ స్పందించింది. మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్తాన్ ద్వారా అమెరికాకు తన అభిప్రాయం తెలిపింది. 14 అంశాలతో ఇరాన్ సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయిలో కాల్పుల విరమణ, శాంతి ఒప్పందం కావాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న యుద్ధాన్ని కూడా ఆపాలని, హార్ముజ్ గుండా నౌకల రవాణాకు తగిన భద్రత కల్పించాలని ఇరాన్ కోరుతోంది. శాశ్వత ప్రాతిపదికన కాల్పుల విరమణ కావాలని డిమాండ్ చేస్తోంది. అలాగే, ఈ ప్రాంతం నుంచి అమెరికా దళాలు పూర్తిస్థాయిలో వైదొలగాలని కూడా కోరుతోంది. అమెరికా--ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అమలవుతున్నప్పటికీ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడి చేస్తోంది. తమ భూతలంపై ఇరాన్ దాడి చేస్తోందని యూఏఈ ఆరోపిస్తోంది. ఇదే సమయంలో తమ దేశంపై దాడులకు దిగితే, తిరిగి ప్రతిదాడులకు వెనుకాడబోమని ఇరాన్ అమెరికాకు వార్నింగ్ ఇచ్చింది. తమ ప్రజల్ని రక్షించుకునేందుకు మళ్లీ దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. తమ నౌకలపై అమెరికా దాడులు చేస్తే తాము కూడా తీవ్రంగా ప్రతిదాడులు చేస్తామని ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది.

### పంజాబ్ మంత్రి అరోరాకు
## ఏడు రోజుల ఇడి కస్టడీ



**న్యూఢిల్లీ మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పంజాబ్ పరిశ్రమల మంత్రి సంజీవ్ అరోరాను గురుగ్రామ్ కోర్టు ఏడురోజుల ఇడి కస్టడీకి పంపినట్లు అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మనీలాండరింగ్ కేసులో అరోరా అధికారిక నివాసం సహా పలు ప్రాంతాల్లో దాడులు జరిపిన అనంతరం శనివారం సాయంత్రం ఇడి అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. అరోరాను చండీగఢ్ నుండి రోడ్డు మార్గంలో గురుగ్రామ్ కు తీసుకువచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇడి పదిరోజుల రిమాండ్ కోరగా, గురుగ్రామ్ లోని పిఎంఎల్ ఎ ప్రత్యేక కోర్టు ఏడు రోజుల కస్టడీ విధించింది. ఈ కేసు రాజకీయ ప్రేరేపితమని మంత్రి తరపు న్యాయవాది తెలిపారు. మే 5న ఇడి కేసు నమోదు చేసి, మే 9న అరోరాను అరెస్ట్ చేసిందని అన్నారు.

# ఉత్తర ప్రదేశ్‌లో మంత్రివర్గ విస్తరణ..

- కొత్త మంత్రులుగా ఆరుగురు ప్రమాణ స్వీకారం



**న్యూఢిల్లీ మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉత్తర ప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలోని బీజేపీ కూటమి ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణ చేపట్టింది. ఆదివారం ఆరుగురు కొత్త మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజధాని లక్నోలోని జన్ భవన్‌లో ఆరుగురి చేత గవర్నర్ ఆనందిబెన్ పటేల్ ప్రమాణ స్వీకారం చేయించారు. భూపేంద్ర చౌదరి, మనోజ్ పాండే, క్రిష్ణ పాశ్వాన్, కైలాష్ సింగ్ రాజ్‌పుత్, హన్స్‌రాజ్ విశ్వకర్మ, సురేంద్ర దైలర్ మంత్రులుగా ప్రమాణం చేశారు.వీరిలో భూపేంద్ర చౌదరి, మనోజ్ పాండేకు క్యాబినెట్ హోదా దక్కింది. అలాగే, మంత్రివర్గంలో మార్పులు కూడా చేపట్టారు యోగి ఆదిత్యనాథ్. ఇప్పటికే మంత్రులుగా ఉన్న అజిత్ సింగ్ పాల్, సోమేంద్ర తోమర్‌లకు స్వతంత్ర మంత్రులుగా అవకాశం కల్పించారు. ఉత్తర ప్రదేశ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్ రాజకీయ అవసరాలకు అనుగుణంగా మంత్రివర్గ విస్తరణ చేపట్టి, పలువురికి అవకాశం కల్పించారు. యోగి 2.0లో 2024లో చేపట్టిన మంత్రివర్గ విస్తరణ తర్వాత మళ్లీ మంత్రివర్గాన్ని విస్తరించడం ఇదే మొదటిసారి. ఈసారి మంత్రివర్గ విస్తరణలో కూటమి పార్టీలకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. ఎస్బీఎస్పీ అధినేత ఓం ప్రకాష్ రాజ్‌బార్, ఆర్ఎల్డీ నేతలు అనిల్ కుమార్, సునీల్ కుమార్ శర్మ, దారా సింగ్ చౌహాన్‌లకు క్యాబినెట్ పదవులు దక్కాయి. అయితే, ఈ మంత్రివర్గ విస్తరణపై ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్ విమర్శలు గుప్పించారు. ఇది కాలక్షేపం కోసం చేసే ప్రక్రియగా అభివర్ణించారు.

# ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగిస్తాం.

- కీలక దశకు చర్చలు..
- వెల్లడించిన రష్యా అధ్యక్షుడు పుతిన్



**న్యూఢిల్లీ మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన రష్యా--ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దశకు చేరుకున్నట్లు కనిపిస్తోంది. త్వరలోనే ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగిస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. రష్యాలోని మాస్కోలో జరిగిన విక్టరీ డే సెలబ్రేషన్స్‌లో పుతిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ యుద్ధంపై కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే ఉక్రెయిన్ యుద్ధం ముగిసే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ యుద్ధం ముగించేందుకు యురోపియన్ యూనియన్‌తో కూడా చర్చలు జరుపుతానని పుతిన్ వెల్లడించాడు. ఈయూ అండతోనే ఉక్రెయిన్.. రష్యాపై యుద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా యురోపియన్ యూనియన్ (ఈయూ)తో చర్చల కోసం జర్మనీ మాజీ ఛాన్సలర్ గెర్హార్డ్ ష్రోడెర్ పేరును పుతిన్ సూచించారు. ఈ చర్చల ద్వారా ఈయూతో రక్షణ ఒప్పందం కుదుర్చుకుంటామన్నారు. ఇటీవలే అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో కూడా పుతిన్ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌తో కాల్పుల ఒప్పందానికి అంగీకరించారు. అలాగే, రెండు దేశాల మధ్య 1,000 మంది సైనిక ఖైదీల అప్పగింతకు కూడా అంగీకరించారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా, యుక్రెయన్ మధ్య కుదిరిన కీలక ఒప్పందం ఇది. ఈ యుద్ధం 2022, ఫిబ్రవరిలో ప్రారంభమైంది. నాలుగేళ్లైనా ఇంకా యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఈ యుద్ధంలో రష్యాకు ఉత్తర కొరియా సైన్యం కూడా సహకరించినట్లు ఆరోపణలున్నాయి. తాజాగా మాస్కోలో జరిగిన విక్టరీ పెరేడ్‌లో కొరియా సైనికులు కూడా పాల్గొనడం ఈ ప్రచారానికి బలం చేకూర్చింది.

# కేరళం సీఎం ఎంపికపై కొనసాగుతున్న సస్పెన్స్..

- 80 శాతం మంది ఎమ్మెల్యేల మద్దతు ఆయనకే



**న్యూఢిల్లీ మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇటీవల ఐదు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల ఫలితాలపై ఒక స్పష్టత వచ్చింది. నాలుగు రాష్ట్రాలకు సీఎంల ఎంపిక పూర్తైంది. తమిళనాడు, పదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ సీఎంల ప్రమాణ స్వీకారం పూర్తికాగా.. అసోం సీఎంగా హిమంత ప్రమాణ స్వీకారం 12న జరగనుంది. ఇక మిగిలింది కేరళ. అక్కడ సీఎం ఎంపికపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది. సీఎంగా ఎవరిని ఎంపిక చేయాలో కాంగ్రెస్ అధిష్టానం ఇంకా నిర్ణయించుకులేకపోతోంది. కేరళంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూడీఎఫ్ కూటమి అధికారం దక్కించుకున్న సంగతి తెలిసిందే. అధికార ఎల్డీఎఫ్‌ను ఓడించి, అధికారం దక్కించుకుంది. 140 అసెంబ్లీ సీట్లున్న కేరళంలో యూడీఎఫ్ కూటమి 102 సీట్లు గెలుచుకుంది. అధికార ఎల్డీఎఫ్ కూటమికి 35 సీట్లు దక్కాయి. ఇక యూడీఎఫ్‌లో అత్యధిక సీట్లు దక్కింది కూడా కాంగ్రెస్ పార్టీకే. దీంతో కాంగ్రెస్ పార్టీకే సీఎం పదవి అందుతుంది. అయితే, సీఎంగా ఎవరిని ఎంపిక చేయాలనే విషయంలో ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ప్రధానంగా కాంగ్రెస్ ఎంపీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరు వినిపిస్తోంది. ఆయన సీఎం రేసులో ముందున్నారు. తన సీఎం పదవి కోసం ప్రయత్నిస్తున్నారు. ఆయన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడు. పైగా ఆయన రహస్యంగా రాహుల్‌ను కలిసి సీఎం పదవిపై చర్చించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక, ఇటీవల గెలిచిన ఎమ్మెల్యేల్లో 80 శాతం మంది వేణుగోపాల్ వైపే మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. ఆయనతోపాటు వీడీ సతీషన్, రమేష్ చెన్నితల పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి. ఈ ముగ్గురూ తాజాగా ఢిల్లీలో కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. సీఎం ఎంపికపై ఈ ముగ్గురితో ఖర్గే, రాహుల్ గాంధీ వంటి కాంగ్రెస్ అగ్రనేతలు మూడు గంటలపాటు చర్చించినట్లు సమాచారం. అయినప్పటికీ ఏ నిర్ణయం తీసుకోలేదు. అయితే, సీఎం పదవి కోసం చేస్తున్న ప్రయత్నాల్ని రాహుల్ గాంధీ తప్పుబట్టారు. ఎవరి లాబీయింగ్ వారు చేసుకోవడం వల్ల చివరకు పార్టీకి నష్టం జరుగుతుందని రాహుల్ అభిప్రాయపడ్డట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. నేతలు అందరి మద్దతు కూడగట్టుకోవాలని, విభజన రాజకీయాలు మానుకోవాలని సూచించారు. వేణుగోపాల్, సతీష్, రమేష్.. ఈ ముగ్గురిలో ఎక్కువ మంది ఎమ్మెల్యేల మద్దతు వేణుగోపాల్‌కు ఉన్నట్లు తెలుస్తోంది. ఆయనకు 45 ఎమ్మెల్యేలు మద్దతిస్తున్నారు. సీఎం పదవికి ఎంపిక చేయడం వల్ల పార్టీలో ఇబ్బందులు రాకూడదని అధిష్టానం భావిస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం ఎంపిక ప్రక్రియ ఆలస్యమవుతోంది. త్వరలోనే కాంగ్రెస్ అధిష్టానం దీనిపై ఒక నిర్ణయం తీసుకునే వీలుంది.

## మాతృ దినోత్సవం రోజు దారుణం..

- తల్లి, తమ్ముడ్ని కాల్చి చంపిన వ్యక్తి



**లక్నో మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాతృ దినోత్సవం రోజున ఒక వ్యక్తి దారుణానికి పాల్పడ్డాడు. కన్న తల్లితోపాటు తమ్ముడ్ని తుపాకీతో కాల్చి చంపాడు. ఆ తర్వాత ఇంటి నుంచి పారిపోయాడు. పోలీసులు ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బందా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. రాజ్‌కిషోర్ గుప్తా కుటుంబానికి చెందిన పూర్వీకుల ఆస్తిని తండ్రి అమ్మాడు. దీని గురించి అతడు ఆగ్రహంతో ఉన్నాడు.కాగా, ఆదివారం తెల్లవారుజామున ఆ భూమి అమ్మకంపై తల్లి, తమ్ముడితో రాజ్‌కిషోర్ గొడవ పడ్డాడు. ఆగ్రహించిన అతడు గన్‌తో వారిపై కాల్పులు జరిపాడు. మాతృ దినోత్సవం రోజున కన్న తల్లితోపాటు సోదరుడ్ని హత్య చేశాడు. ఆ తర్వాత ఇంటి నుంచి పారిపోయాడు. మరోవైపు కాల్పుల శబ్దాలకు స్థానికులు ఉలిక్కిపడ్డారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఆ ఇంటికి చేరుకున్నారు. రక్తం మడుగుల్లో పడి ఉన్న మహిళ, ఆమె కుమారుడ్ని ఆసుపత్రికి తరలించగా అప్పటికే వారు మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. ఫోరెన్సిక్ బృందాన్ని రప్పించి ఆ ఇంటి నుంచి ఆధారాలు సేకరించారు. నిందితుడు రాజ్‌కిషోర్ అరెస్ట్ కోసం నాలుగు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు.

## ప్రధాని పర్యటన వేళ బెంగళూరులో జిలెటిన్ స్టిక్స్ కలకలం..!

**న్యూఢిల్లీ మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



కర్ణాటక రాజధాని బెంగళూరు లో ఆదివారం బీజేపీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ సభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ప్రధాని సమావేశానికి హాజరుకావడానికి ముందు వేదికకు మూడు కిలోమీటర్ల దూరంలోని కగలిపుర లో రెండు జిలెటిన్ స్టిక్స్ లభ్యమైనట్లు పోలీసులు వెల్లడించారు. బాంబు నిర్వీర్య దళాలు వాటిని అక్కడి నుంచి తరలించినట్లు తెలిపారు.కాగా ఆ జిలెటిన్ స్టిక్స్‌ను అక్కడ పెట్టినట్లు భావిస్తున్న ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు. దాంతో అధికారులు అప్రమత్తమై ఆ ప్రాంతంలో విస్తృత సోదాలు నిర్వహించారు. ప్రధాని మోదీ వేదిక వద్దకు చేరుకోవడానికి ముందు ఆయన కాన్వాయ్ వచ్చే మార్గంలో నిర్వహించిన సాధారణ భద్రతా తనిఖీల్లో ఈ జిలెటిన్ స్టిక్స్‌ను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

# బిజినెస్

## ఉద్యోగుల అవినీతి.. మూడేళ్లలో వెయ్యి మందిని తొలగించిన ఎయిరిండియా..




గత మూడు సంవత్సరాల్లో ఎయిరిండియా 1,000 మందికి పైగా ఉద్యోగులను విధుల నుంచి తొలగించినట్లు సంస్థ సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ వెల్లడించారు. నైతిక ఉల్లంఘనలు, ఉద్యోగ ప్రయోజనాల దుర్వినియోగం, అక్రమ చర్యల్లో పాల్గొన్నారనే కారణాలతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇటీవల ముంబైలో జరిగిన టౌన్‌హాల్ మీటింగ్‌లో సీఈవో క్యాంప్‌బెల్ ఈ విషయాన్ని వెల్లడించారు. కొందరు ఉద్యోగులు అదనపు లగేజీకి చార్జీలు లేకుండా అనుమతించడం, విమానాల నుంచి వస్తువులను అక్రమంగా తరలించడం వంటి చర్యలకు పాల్పడ్డారని క్యాంప్‌బెల్ పేర్కొన్నారు. ఎంప్లాయీ లీజర్ ట్రావెల్ పాలసీని కూడా వందలాది మంది ఉద్యోగులు దుర్వినియోగం చేశారని తెలిపారు. ఎవరూ చూడకపోయినా సరైన విధంగా వ్యవహరించడం ఉద్యోగుల బాధ్యతన్నారు. సంస్థలో ప్రతి సంవత్సరం వందలాది మంది ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు . పశ్చిమాసియాలో పరిస్థితులు చక్కబడకపోతే ఈ ఏడాది కూడా కఠిన పరిస్థితులు తప్పవని అన్నారు . టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిరిండియాలో ప్రస్తుతం సుమారు 24,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఆర్థిక ఒత్తిళ్లు, పెరుగుతున్న ఖర్చులు, అంతర్జాతీయ విమానయాన రంగంలోని సవాళ్ల మధ్య సంస్థ ఖర్చు నియంత్రణ చర్యలను కఠినతరం చేసినట్లు సమాచారం.

## బంగారం కొనే వారికి గుడ్‌న్యూస్..
# మళ్లీ తగ్గిన పసిడి ధరలు.. తులం ఎంతంటే?

గత కొన్ని రోజులుగా ఉరుకులు పెడుతున్న బంగారం, వెండి ధరలకు సడెన్ బ్రేకులు పడ్డాయి. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,52,235 వద్ద కొనసాగుతుండగా 22 క్యారెట్ల ధర రూ.1,39,650 వద్ద ట్రేడవుతుంది. వెండి ధరలు కూడా అదే బాటలో పయనిస్తూ కిలోకు రూ. 2,62,350 వద్ద స్థిరంగా ఉన్నాయి. ఇక హైదరాబాద్, విజయవాడ, విశాఖ పట్నం సహా దేశ వ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

**దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు**

హైదరాబాద్‌లో బంగారం 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,52,350, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,650 ఉంది. వెండి కిలో ధర రూ.2,62,350గా ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,52,350, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,650 ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,53,010, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర



రూ.1,40,260 ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,52,350,, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,650 ఉంది.

కోల్‌కత్తాలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,52,350, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,650 ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,54,370,గా ఉండగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,41,500గా ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,52,500, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ1,39,800 వద్ద కొనసాగుతుంది.

మధ్యప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ వాతావరణం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెట్టుబడిదారులను బంగారం వైపు మళ్ళిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న వస్తువుల ధరలు, కరెన్సీ విలువ తగ్గడం వంటి కారణాల వల్ల సురక్షితమైన పెట్టుబడిగా బంగారానికి డిమాండ్ పెరుగుతోంది. అయితే పశ్చిమాసియా ఉత్రిక్తల నేపథ్యంలో ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగాయి. అయితే ఆయిల్ రేట్స్ పెరిగినప్పుడు సాధారణంగా బంగారం ధరలు కూడా ప్రభావితమవుతాయి. కాబట్టి నిపుణుల ప్రకారం, రాబోయే రోజుల్లో 10 గ్రాముల బంగారం ధర రూ. 2 లక్షల మార్కును కూడా తాకవచ్చని చెబుతున్నారు. అయితే మీరు నగలు చేయించుకోవాలనుకుంటే, ధర కొంచెం తగ్గినప్పుడు కొనడం మంచిది. అదే పెట్టుబడి కోసం అయితే, దీర్ఘకాలికంగా 5-10 ఏళ్లు బంగారం ఎప్పుడూ లాభదాయకమే.

# సీబీ 1000 హార్నెట్ ఎస్‌పీ బైకుల రీకాల్


**న్యూఢిల్లీ, మే 9**

హోండా మోటర్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియాకు చెందిన సీబీ 1000 హార్నెట్ ఎస్‌పీ మోటర్‌సైకిళ్లను రీకాల్ చేస్తున్నట్టు ప్రకటించింది. చమురు పైపునకు సంబంధించి రెండు రకాల టెక్నికల్ సమస్యలు తలెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నది. సెప్టెంబర్ 30, 2024 నుంచి ఆగస్టు 22, 2025లోపు తయారైన ఈ మోటర్‌సైకిళ్లలో రెండు సాంకేతిక సమస్యలు గుర్తించినట్టు, దీంట్లో ఇంధన సరఫరా గొట్టం అమరికకు సంబంధించనదని, నిర్దిష్ట పరిస్థితుల్లో ఆ పైపు సరిగ్గా బిగించబడి ఉండేలా నిర్ధారించుకోవడానికి తనిఖీ అవసరమని గుర్తించి వెంటనే ఈ బైకులను వెనక్కి పిలిపించినట్టు తెలిపింది.



## చెపాక్‌లో ఉర్విల్ ఊచకోత..
# ఎనిమిదో ఓటమితో లక్నో ఔట్..!

లీగ్ దశ ఆఖర్లో గొప్పగా ఆడుతున్న సొంతగడ్డపై చెన్నై సూపర్ కింగ్స్ .. భారీ లక్ష్యాన్ని ఉఫ్‌మనిపించింది. చెపాక్‌లో ఉర్విల్ పటేల్(65) రికార్డు అర్ధ శతకంతో మెరవగా.. లక్నో సూపర్ జెయింట్స్ పై సీఎస్కే 5 వికెట్లతో జయభేరి మోగించింది. 204 పరుగుల ఛేదనలో లక్నో బౌలర్ల భరతం పట్టిన ఉర్విల్.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(42)తో గెలుపు తోవలో నడిపాడు. కానీ.. మిడిల్ ఓవర్లలో షాదాబ్, దిగ్వేశ్ రథీల విజృంభణతో మ్యాచ్ లక్నోవైపు మళ్లింది. కానీ, డెత్ ఓవర్లలో ఇంప్యాక్ట్ సబ్ ప్రశాంత్ వీర్(18 నాటౌట్), శివం దూబే(15 నాటౌట్)లు కళ్లుచెదిరే సిక్సర్లతో లక్నో ఆశల్ని ఆడియాసలు చేశారు. పసుపు జెర్సీలతో నిండిపోయిన చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్ విజయ గర్జన చేసింది. బౌలర్లు ప్రత్యర్థికి భారీ స్కోర్ సమర్పించిన చోట.. కుర్రాడు ఉర్విల్ పటేల్(65 : 23 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా విరుచుకుపడగా లక్నో బౌలర్లు బెంబేలెత్తిపోయారు. ఆఖర్లో ఉత్కంఠ నెలకొన్నప్పటికీ.. డెత్ ఓవర్లలో ఇంప్యాక్ట్ సబ్ ప్రశాంత్ వీర్(18 నాటౌట్), శివం దూబే(15 నాటౌట్)లు ఒత్తిడికి లోన్వకుండా చెన్నైకి 5 వికెట్ల విజయాన్ని కట్టబెట్టారు. ఆరో విక్టరీతో 12 పాయింట్లు సాధించిన చెన్నై.. టాప్-5లో నిలిచింది. 11 మ్యాచుల్లో ఎనిమిదింటా ఓడిన లక్నో ప్లే ఆఫ్స్ రేసు నుంచి వైదొలిగింది. లక్నో నిర్దేశించిన భారీ ఛేదనను ఓపెనర్ శాంసన్(28)ను ధాటిగా



ఆరంభించాడు. బౌండరీలో చెలరేగిన సంజూను దిగ్వేశ్ రథీ బౌల్డ్ చేసి తొలి వికెట్ అందించాడు. అవేశ్ ఖాన్‌ను వణికించిన ఉర్విల్ పటేల్(65) చివరి మూడు బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపగా 5 ఓవర్లకే చెన్నై స్కోర్ డెబ్బై దాటింది. ఆ తర్వాతి ఓవర్లో దిగ్వేష్‌ను వదలని ఉర్విల్.. మూడు సిక్సర్లు, ఒక ఫోర్‌తో స్టేడియాన్ని హోరెత్తించాడు. వరసగా రెండు ఓవర్లలో 25 చొప్పున రన్స్ రావడంతో పవర్ ప్లేలో సీఎస్కే వికెట్ నష్టానికి 97 పరుగులు చేసింది.

పవర్ ప్లే తర్వాత సింగిల్‌తో 13 బంతుల్లోనే ఉర్విల్ అర్ధ శతకంతో రికార్డు నెలకొల్పాడు. ఆదే ఊపులో.. ఆడిన అతడు.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(42)తో చెన్నైని గెలుపు దిశగా నడిపాడు. షాదాబ్ ఓవర్లో అవేశ్ చేతికి చిక్కడంతో ఉర్విల్ తుఫాన్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. అప్పటికే సగం లక్ష్యం కరిగిపోవడంతో చెన్నైకి భారీ విజయం పక్కా అనిపించింది. కానీ, షాదాబ్ ఓవర్లో గైక్వాడ్ బౌల్డవ్వగా.. బ్రెవిస్(10)ను రథీ బౌల్డ్ చేశాడు. ఫామ్‌లో ఉన్న కార్తిక్ శర్మ(20)ను అవేశ్ పెవిలియన్ పంపడంతో ఇంప్యాక్ట్ సబ్‌గా ప్రశాంత్ వీర్(18 నాటౌట్) వచ్చాడు. 18 బంతుల్లో 30 రన్స్ అవసరమవ్వగా.. ప్రిన్స్ 9 రన్సే ఇవ్వడంతో ఉత్కంఠ మొదలైంది. రథీ, పూరన్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన ప్రశాంత్ రెండు సిక్సర్లతో మెరవగా.. మర్క్‌రమ్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో శివం దూబే(15 నాటౌట్) తొలి రెండు బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపాడు. దాంతో 5 వికెట్లతో గెలుపొందిన సీఎస్కే 12 పాయింట్లతో ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది.


**రెచ్చిపోయిన ఇంగ్లిస్**

పంతొమ్మిదో సీజన్‌లో ప్లే ఆఫ్స్ రేసులో లేని లక్నో సూపర్ జెయింట్స్ భారీ స్కోర్ కొట్టింది. ఓపెనర్ జోష్ ఇంగ్లిస్(85) అర్ధ శతకంతో భారీ స్కోర్‌కు పునాది వేశాడు. కానీ, ఓవర్టన్(3-36), అన్షుల్ కంబోజ్(2-47)లు వికెట్ల వేటతో మిడిలార్డర్‌కు బ్రేకులు వేశారు. షాదాబ్ అహ్మద్(43 నాటౌట్), హిమ్మత్ సింగ్(17) డెత్ ఓవర్లలో ధనాధన్ ఆడి స్కోర్ రెండొందలు దాటించారు. ఒకదశలో 230 ప్లస్ కొట్టేలా కనిపించినా చివరకు వీరిద్దరి కృషి ఫలితంగా లక్నో 203కు పరిమితమైంది.

**జోష్ ఇంగ్లిస్(85)**

## ఐపీఎల్‌లో సంచలనం..
# రికార్డు హాఫ్ సెంచరీ బాదిన అన్‌క్యాప్డ్ ప్లేయర్..!

ఐపీఎల్‌లో అన్‌క్యాప్డ్ ప్లేయర్ ఉర్విల్ పటేల్ చరిత్ర సృష్టించాడు. పంతొమ్మిదో సీజన్‌లో తొలిసారి బ్యాట్ ఝులిపించిన ఈ చెన్నై చిన్నోడు రికార్డు అర్ధ శతకంతో రికార్డు నెలకొల్పాడు. చెపాక్ స్టేడియంలో పూనకం వచ్చినట్టే ఆడిన ఉర్విల్.. ఏకంగా 13 బంతుల్లోనే యాభై రన్స్‌తో చెలరేగాడు. తద్వారా ఈ మెగా టోర్నీ చరిత్రలో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీతో యశస్వీ జైస్వాల్ రికార్డను సమం చేశాడీ హిట్టర్. చెపాక్ స్టేడియంలో సిక్సర్ల వర్షం కురిపించాడు ఉర్విల్ పటేల్. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లను ఊచకోత కోసిన ఉర్విల్.. ఎదుర్కొన్న ఎనిమి ది బంతులను.. 1, 6, 6, 6, 6, 4, 6 గా మలిచి అర్ధ శతకానికి చేరువయ్యాడు. అవేశ్ ఖాన్, దిగ్వేజ్ రథీ బౌలింగ్‌ను తుత్తునియలు చేసిన ఉర్విల్.. షమీ,



షాదాబ్‌ను ఉతికేస్తూ 13 బంతుల్లోనే హాఫ్ సెంచరీతో చరిత్ర లిఖించాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ పై 2023లో యశస్వీ జైస్వాల్ నెలకొల్పిన వేగవంతమైన ఫిఫ్టీ రికార్డును ఉర్విల్ సమం చేశాడు. కమిన్స్, కేఎల్ రాహుల్, రొమారియో షెఫర్డ్ 14 బంతుల్లో అర్ధ శతకంతో ఆ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు

**ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ వీళ్లే..**

యశస్వీ జైస్వాల్ (రాజస్థాన్ రాయల్స్)- 13 బంతుల్లో -- కోల్‌కతాపై 2023లో.

ఉర్విల్ పటేల్ (చెన్నై సూపర్ కింగ్స్) -- 13 బంతుల్లో -- లక్నోపై 2026లో.


కేఎల్ రాహుల్(పంజాబ్ కింగ్స్) -- 14 బంతుల్లో -- ఢిల్లీ క్యాపిటల్స్‌పై 2018లో.

ప్యాట్ కమిన్స్(కోల్‌కతా నైట్ రైడర్స్) -- 14 బంతుల్లో ముంబై ఇండియన్స్‌పై 2022లో.

రొమారియో షెపర్డ్(ఆర్సీబీ)- 14 బంతుల్లో -- చెన్నై సూపర్ కింగ్స్‌పై 2025లో .

# స్పోర్ట్స్

## సీనియర్లకే మరో ఛాన్స్.. ఇద్దరు పేసర్లతో ప్రపంచకప్ స్క్వాడ్..!



మహిళల టీ20 ప్రపంచకప్ సమీపిస్తున్నందున బంగ్లాదేశ్ బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. నిగర్ సుల్తానా కెప్టెన్‌గా పదిహేను మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేసింది. గత ఎడిషన్ స్క్వాడ్‌లోని 11 మందికి మళ్లీ చోటు దక్కగా.. సీనియర్ షర్మీన్ సుల్తానా స్థానంలో టాపార్డర్ బ్యాటర్ తేజ్ నెహర్‌కు సెలెక్టర్లు అవకాశమ ఇచ్చారు. అయితే.. అందర్నీ ఆశ్చర్య పరుస్తూ ఈ ఐసీసీ ఈవెంట్‌లో ఇద్దరు పేసర్లతోనే బంగ్లా జట్టు ఆడనుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో పొట్టి ప్రపంచకప్ పండుగకు బంగ్లాదేశ్ మహిళల జట్టు సిద్ధమవుతోంది. స్క్వాడ్ ఎంపిక అనంతరం చీఫ్ సెలెక్టర్ సజాద్ అహ్మద్ మాట్లాడుతూ ఇద్దరు పేసర్లను మాత్రమే తీసుకోవడంపై వివరణ ఇచ్చాడు. 'బంగ్లాదేశ్ బృందంలో ఇద్దరు పేసర్లు ఉండడానికి కారణం పేసర్లు త్వరగా గాయపడుతారు. పైగా ఇంగ్లండ్‌లో వికెట్ ఒకప్పటిలా పేస్‌కు కాకుండా ఉపఖండం మాదిరిగా ఉంటుందని తెలిసింది. అంటే.. స్పిన్నర్లకు అనుకూలిస్తాయి.

సో.. అందుకే స్పిన్నర్లపై నమ్మకం ఉంచాం. వన్డేల్లో రాణిస్తున్న షర్మీన్ సుల్తానా బదులు తేజ్ నెహర్‌ను ఎంపిక చేయడానికి కారణముంది. నెహర్ వైవిధ్యమైన ప్లేయర్. ఆమె ఓపెనింగ్ నుంచి ఆరో స్థానంలో ఎక్కడైనా ఆడగల సమర్థురాలు. డెత్ ఓవర్లలో తను గొప్పగా ఆడగలదు' అని సజాద్ వెల్లడించాడు. అంతేకాదు ఫార్మాట్‌కు తగ్గట్టుగా దూకుడైన ఆట ఆడేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నాడు.

'బంగ్లాదేశ్ జట్టు డిఫెన్స్ స్టయిల్ బ్యాటింగ్ అతిపెద్ద సమస్యగా మారింది. ఒక్కరాత్రిలోనే అంతా మారిపోతుందని నేను చెప్పను. కానీ, ఈ సమస్యను పరిష్కరించేందుకు సెలెక్టర్లు ప్రయత్నిస్తున్నారు' అని సజాద్ తెలిపాడు. టాపార్డర్‌లో నిగర్ సుల్తానా, షర్మీన్ అక్తర్, శోభనా మొస్త్రే, తేజ్ నెహర్ కీలకం కానున్నారు. నిరుడు భారత్, శ్రీలంక ఆతిథ్యమిచ్చిన వన్డే వరల్డ్‌కప్‌లో మెరిసిన యువ పేసర్ మరుఫా అక్తర్‌తో పాటు ఫరిహా ఇస్లాం కొత్త బంతిని పంచుకోనుంది. వరల్డ్‌కప్ సన్నాహకాల్లో భాగంగా నెదర్లాండ్స్, స్కాట్లాండ్‌తో ముక్కోణపు సిరీస్ ఆడనుంది. ఇంగ్లండ్ వేదికగా జూన్12 నుంచి పొట్టి ప్రపంచకప్ మొదలవ్వనుంది.

**బంగ్లాదేశ్ ప్రపంచకప్ స్క్వాడ్ :** నిగర్ సుల్తానా జోటీ(కెప్టెన్), నహిదా అక్తర్(వైస్ కెప్టెన్), షర్మీన్ అక్తర్, శోభనా మొస్త్రే, షోర్నా అక్తర్, రీతు మోని, రబేయ ఖాన్, పాహిమా ఖాతూన్, ఫరీహ ఇస్లాం, మరుఫా అక్తర్, షాంజిద అక్తర్, సుల్తానా ఖాతున్, దిలరా అక్తర్, జుయైరియా ఫిర్దౌస్, తాజ్ నెహర్.